విలేకరులు కావలెను

TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
R N I No. APTEL/2012/53127

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును

9703247143

TELANGANA VANI TELUGU DAILY

తెలంగాణ వాణి

R N I No. APTEL/2012/53127

తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA

ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 214 | సోమవారం 12.10. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00

'షీ పవర్'
మహిళా భద్రత బైక్ ర్యాలీ

- జెండా ఊపి ప్రారంభించిన మంత్రులు జూపల్లి, పొన్నం
- మహిళల భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత: జూపల్లి
- మహాలక్ష్మి పథకంతో మహిళలకు ప్రయాణ స్వేచ్ఛ
- మహిళల భద్రత, సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం: మంత్రి పొన్నం ప్రభాకర్
- ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



భారత్-జపాన్ స్నేహ బంధం దీర్ఘకాలికం

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- హైదరాబాద్‌లో జపాన్ ఫెస్టివల్-2026 కార్యక్రమం
- పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి వివేక్



సమృద్ధి భారత్

25 నగరాలకు మెట్రో సేవలు | ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీదారుగా భారత్

దేశాభివృద్ధినే మంత్రంగా తీసుకొని ముందుకు సాగుతున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీదారుగా భారత్ మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 2014 నుంచి మన ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 11 రెట్లు పెరిగాయని కొనియాడారు. రక్షణ పరికరాల తయారీలో స్వయం సమృద్ధి సాధిస్తున్నామని తెలిపారు. 12 ఏళ్లలో అనేక రంగాల్లో మార్పులు తెచ్చినట్లు చెప్పారు. తయారీ రంగంలో వృద్ధి వల్ల యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయని వివరించారు. తమిళనాడు అభివృద్ధికి అండగా ఉండటంతో పాటు విజయ్ ప్రభుత్వానికి చేయూత అందిస్తామన్నారు. చెన్నైలో రూ.13 వేల కోట్లకుపైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. 2014లో 5 నగరాలకే పరిమితమైన మెట్రో రైలు సేవలు ఇప్పుడు 25 నగరాలకు విస్తరించాయని గుర్తు చేశారు. ప్రభుత్వ అధినేతగా తన 25 ఏళ్ల సుదీర్ఘ సేవాకాలాన్ని ప్రధాని మోదీ ప్రస్తావించారు.

- తమిళనాడు పర్యటనలో భాగంగా 13 వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- తమిళనాడు సీఎంతో కలిసి ప్రధాని ప్రయాణం
- ఐఐటీ మద్రాస్‌లో బ్రెయిన్ సెంటర్ జాతికి అంకితం

హైదరాబాద్ తెలంగాణ వాణి)

పార్టీలకు అతీతంగా తమిళనాడు నాయకత్వంతో తనకు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. సంవత్సరాలు గడిచినా, రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా, రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి తన నిబద్ధత స్థిరంగా ఉందన్నారు. "ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కరుణానిధి, జయలలితతో మాట్లాడే అవకాశాలు చాలాసార్లు నాకు లభించాయి. నేను ప్రధానమంత్రి అయిన తర్వాత జయలలిత, పన్నీర్‌సెల్వం, పళనిస్వామి, ఎం.కె. స్టాలిన్‌లతో కలిసి పనిచేసే అవకాశం దక్కింది. ప్రభుత్వాలు మారినప్పటికీ, తమిళనాడును అభివృద్ధి చేయాలనే, ఇక్కడి ప్రజలకు సేవ చేయాలనే నా సంకల్పం మాత్రం అలాగే ఉంది. ఇప్పుడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌తో కలిసి ఈ ప్రయాణాన్ని ముందుకు సాగిస్తున్నాం."అని అన్నారు.



మోడీ 25 ఏళ్ల ప్రజాపాలన స్ఫూర్తిదాయకం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

హైదరాబాద్ తెలంగాణ వాణి)

ప్రజాప్రతినిధిగా, ప్రభుత్వ అధినేతగా విజయవంతంగా 25 సంవత్సరాల పాలనను పూర్తి చేసుకున్న ప్రధానమంత్రి నరేంద్రమోడీకి తెలంగాణ రాష్ట్ర బీజేపీ ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అధ్యక్షతన.. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానిమోడీ అనుసరిస్తున్న 'నాగరిక్ దేవో భవ' మార్గదర్శక సూత్రాన్ని నేతలు కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా తెలంగాణ రూ.13 లక్షల కోట్లకు పైగా నిధులు పొందిందని ఈ సమావేశం స్పష్టం చేసింది. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాలు విజయవంతం కావడంపై నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు లక్ష్మణ్, ఎంపీలు డీ.కే.అరుణ, ఈటల రాజేందర్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, శాసనమండలి పక్ష నాయకుడు ఏవీఎన్ రెడ్డి, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్, రాష్ట్ర కో-ఇంచార్జ్ అభయ్ పాటిల్ పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావం పట్ల అప్రమత్తంగా ఉండాలి

- రైతులు రెండో పంట వేసి ఇబ్బంది పడొద్దు
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి
- కూసుమంచి మండలంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

2 లో



వేగంగా... క్షేమంగా...

కేబీఆర్ పార్క్ చుట్టూ విజయవంతమైన వన్ వే

మరింత సజావుగా వాహనాలు పరుగెత్తేలా వసతుల కల్పన
చురుగ్గా సాగుతున్న జంక్షన్ల విస్తరణ, ఫ్లైఓవర్ నిర్మాణం
విలువైన స్థలాల ఇచ్చిన బాలకృష్ణ, శబ్దాలయా స్టూడియో, భవ్య కన్‌స్ట్రక్షన్స్

11

ఢిల్లీలో కాంగ్రెస్‌కు ప్రజాస్వామ్య హక్కులు..
తెలంగాణలో బీజేపీకి నిర్బంధాలా?

అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఒక రకంగా.. అధికారంలో లేనిచోట మరో రకంగా వ్యవహరించడమే కాంగ్రెస్ మార్క్ ప్రజాస్వామ్యమా?

- ప్రజాస్వామ్యాన్ని అడ్డుపెట్టుకుని విధ్వంస రాజకీయాలు చేస్తూ..
- 'నిర్బంధ ప్రజాస్వామ్యం' అని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఖర్గే మాట్లాడటం సిగ్గుచేటు
- ఎమర్జెన్సీ సమయంలో కాంగ్రెస్ అత్యంత దుర్మార్గంగా 'ప్రజాస్వామ్యాన్ని ఖూనీ' చేసింది
- ఇవాళ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతోంది
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

2



సిరిసిల్లలో శాశ్వత క్యాంపస్ నిర్మాణం చేపట్టండి: కేటీఆర్

హైదరాబాద్ తెలంగాణ వాణి)



రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ (ఖు=) సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి.. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. 2021లో రూ.402 కోట్ల పరిపాలనా అనుమతులతో మంజూరైన జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణం ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నదని పేర్కొన్నారు. మండేపల్లి గ్రామంలో 20 ఎకరాల భూమిని కేటాయించినప్పటికీ, నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో కళాశాల ప్రస్తుతం అగ్రహారంలోని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో తాత్కాలికంగా కొనసాగుతున్నదని తెలిపారు. కళాశాలను ప్రస్తుత ప్రాంగణం నుంచి మరో ప్రైవేటు భవనానికి తరలించే ప్రతిపాదనలు విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి ఇబ్బందులు కలిగించే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న తరగతి గదులు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక సదుపాయాలు నిరుపయోగం కాకుండా చూడాలని సూచించారు. ఈ నేపథ్యంలో వండర్‌లాలో కేటాయించిన స్థలంలో శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి పనులను వేగవంతం చేయాలని కోరారు. అలాగే.. కొత్త క్యాంపస్ పూర్తయ్యే వరకు కళాశాలను ప్రస్తుత ప్రాంగణంలోనే కొనసాగించేందుకు అనుమతించాలని పేర్కొన్నారు. తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగే వరకు కళాశాల ప్రస్తుత ప్రాంగణాన్ని ఖాళీ చేయాలంటూ నోటీసులు జారీ చేయకుండా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందించడంలో ఈ కళాశాల కీలకమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు.

డ్రగ్స్ నెట్‌వర్క్‌పై ఉక్కుపాదం

- పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్
- డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్‌పై ఈగల్, హైదరాబాద్ పోలీసులు సంయుక్త ఆపరేషన్



గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు అనుమానిస్తున్న నెట్‌వర్క్‌పై తెలంగాణ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ఈగల్ బృందం, హైదరాబాద్ సిటీ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి, పరారీలో ఉన్న నిందితుడు కస్టోడియో ఫెర్నాండెస్ అలియాస్ క్రిస్సీని గోవాలో అరెస్టు చేశారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి : మంత్రి సీతక్క

హైదరాబాద్ తెలంగాణ వాణి)



గ్రామీణ మహిళల ప్రతిభకు, స్వయం ఉపాధికి వేదికగా నిలుస్తున్న 'సారస్' గ్రామీణ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ మేళా హైదరాబాద్‌లో ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ఈ మేళాను రాష్ట్ర మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. డప్పు చప్పుళ్లు, కోయ నృత్యాలు, కూచిపూడి, భరతనాట్యం తదితర సాంస్కృతిక ప్రదర్శనల మధ్య మంత్రికి ఘన స్వాగతం లభించింది. అనంతరం రిబ్బన్ కట్ చేసిన ఆమె.. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆసక్తిగా పరిశీలించారు. మహిళలు తయారు చేసిన హస్తకళలు, చేనేత వస్త్రాలు, గృహోపకరణాలు, పచ్చళ్లు, చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీ విధానం, విక్రయాలపై వారిని అడిగి తెలుసుకున్నారు. వ్యాపారంలో ఎదురవుతున్న సవాళ్లపై వారితో చర్చించిన మంత్రి.. మహిళలు స్వయంగా తయారుచేసిన పలు వంటకాలను రుచి చూశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల మహిళలు కేవలం పొదుపు, రుణాలకే పరిమితం కాకుండా ఉత్పత్తి దారులుగా, పారిశ్రామిక వేత్తలుగా ఎదగాల న్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. గ్రామీణ ఉత్పత్తులకు పట్టణ, జాతీయ స్థాయి మార్కెట్ కల్పించేందుకే ఈ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యాపార విస్తరణ, మెరుగైన ఆదాయం కోసం నాణ్యతతో పాటు ప్యాకే జింగ్, బ్రాండింగ్, డిజిటల్ మార్కెటింగ్‌పై మహిళలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. సంఘాల బలోపేతానికి ప్రభుత్వం బ్యాంక్ రుణాలు, వడ్డీ రాయితీలు, నైపుణ్య శిక్షణ అందిస్తోందని, ఆ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళల ఆర్థికాభివృద్ధితోనే కుటుంబ జీవన ప్రమాణాలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడతాయని మంత్రి స్పష్టం చేశారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

కులమతాలకు అతీతంగా ఐక్యతతో మెలగాలి: కార్పొరేటర్ మునిగడప పద్మ



కొత్తగూడెం, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి)

పట్టణ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని, కులమతాలకు అతీతంగా ఐక్యతతో మెలగాలని 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ ఆకాంక్షించారు. ఆదివారం కొత్తగూడెంలోని లక్ష్మీ టాకీస్ ప్రాంతంలో నాగయ్య గడ్డ, లక్ష్మీ టాకీస్ ఏరియా యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీశ్రీ విజయదుర్గ అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ, ప్రజలందరూ బాగుండాలనే సంకల్పంతో భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. కులమత భేదాలు లేకుండా ఐకమత్యంతో జీవించాలని ఆకాంక్షించారు. యువత చెడు మార్గాలకు దూరంగా ఉంటూ, భక్తిమార్గంలో నడవడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా బస్తీకి చెందిన మహిళలు, పెద్దలు, యువకులు అధిక సంఖ్యలో అమ్మవారి మాలలు ధరించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏరియా పెద్దలు, నిర్వాహకులు చనగరపు నరేష్, కడలి మహేష్, జిత్తుక దిలీప్, శ్రీకాంత్, అశోక్, లగ్గాల వంశీ, మనీ, సదానందం, మహిళలు సునీత, సౌమ్యశ్రీ, అనసూర్యతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి శరన్నవరాత్రి మహోత్సవాల్లో పాల్గొన్న వనమా రాఘవేందర్

ఉత్సవ కమిటీ చైర్మన్‌కు ఘన సత్కారం



పాల్వంచ, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి):

పాల్వంచ పట్టణంలోని జ్యోతినగర్‌లో నిర్వహిస్తున్న శ్రీ పెద్దమ్మ తల్లి శరన్నవరాత్రి మహోత్సవాల్లో వనమా రాఘవేందర్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న వనమా రాఘవేందర్‌ను కమిటీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కె.వి. రావు, కార్యవర్గ సభ్యులు శివరాత్రి శీను, ముత్యాల రమణమూర్తి, బెల్లం పద్మ, హనుమంతరావు, తాతముడి మహేష్, కరివేద విజయలక్ష్మి, సత్యనారాయణతో పాటు స్థానిక భక్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావనతో మానసిక ప్రశాంతత

- అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలి
- శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే కూనంనేని



పాల్వంచ, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి)

అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. పాల్వంచ మండలం కేపీ జగన్నాధపురంలోని ప్రసిద్ధ శ్రీ పెద్దమ్మ తల్లి దేవస్థానంలో ఆదివారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, జ్యోతి ప్రజ్వలనతో ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో మానసిక ప్రశాంతతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు, తాగునీరు, ప్రసాదాల పంపిణీ విషయంలో ఆలయ కమిటీ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా సాగేందుకు భక్తులు, ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం అర్చకులు ఎమ్మెల్యేకు వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, ఆలయ ఈవో విజయ్ కుమార్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు డి. సుధాకర్, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, నిమ్మల రాంబాబు, వి. పద్మజ, నాయకులు శనగారపు శ్రీనివాసరావు, బీవీ సత్యనారాయణ, బానోతు రవి, రంజిత్, గొర్లె నరేష్, సక్రు, రాందాస్, కిరణ్ కుమార్, అల్లి వెంకటేశ్వర్లు, సంజీవరావు, రామారావు, కాంగ్రెస్ నాయకులు కొండ వెంకన్న, మహిపతి రామలింగం, బాలినేని నాగేశ్వరరావు, గంధం నరసింహారావు, బార్ల జోషి తదితరులు పాల్గొన్నారు.

క్లర్క్‌గా చేరి.. క్లర్క్‌గానే రిటైర్ కావాలా?

- సెక్రటేరియల్ సిబ్బందికి పదోన్నతులు కల్పించి ఎగ్జిక్యూటివ్ క్యాడర్ ఇవ్వాలి
- క్యాడర్ స్కీమ్‌ను సవరించాలి.. సమస్యల పరిష్కారానికి త్వరలో ఉద్యమం
- ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి)

: సింగరేణి సంస్థలో సెక్రటేరియల్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్ డిమాండ్ చేశారు. ఉన్నత విద్యార్హతలు, సుదీర్ఘ అనుభవం ఉన్నప్పటికీ పదోన్నతులు లేకుండా క్లర్క్‌గానే పదవీ విరమణ చేయాల్సిన పరిస్థితి నెలకొనడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బందికి అర్హతలు, అనుభవానికి తగిన పదోన్నతులు కల్పించి ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లోకి తీసుకురావాలని కోరారు. సెక్రటేరియల్ సిబ్బంది సమస్యల పరిష్కారం, క్యాడర్ స్కీమ్ సవరణ, పదోన్నతుల కల్పన తదితర డిమాండ్ల సాధన కోసం ఆదివారం కొత్తగూడెంలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో కొత్తగూడెం రీజియన్ పరిధిలోని కార్పొరేట్, సత్తుపల్లి, మణుగూరు, ఇల్లందు ప్రాంతాల క్లరికల్ ఉద్యోగుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వివిధ కార్మిక సంఘాల నాయకులు హాజరై ఉద్యోగుల సమస్యలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

క్యాడర్ స్కీమ్‌ను సవరించాలి

సింగరేణిలో ప్రస్తుతం అమలవుతున్న క్యాడర్ స్కీమ్‌ను



సమీక్షించి, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా సవరించాలని సదస్సులో ఉద్యోగులు డిమాండ్ చేశారు. ముఖ్యంగా పీఏలు, ఓఎస్‌లకు తగిన పదోన్నతులు కల్పించి ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లోకి తీసుకురావాలని కోరారు. ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ పోస్టులను వెంటనే భర్తీ చేయడంతో పాటు సిబ్బందిపై పెరుగుతున్న పనిభారాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. విధుల నిర్వహణకు అవసరమైన ఫర్నిచర్ సౌకర్యాలు కల్పించాలని, కంప్యూటర్ అలవెన్స్ మంజూరు చేయాలని కోరారు. సిబ్బంది పని స్వభావం, బాధ్యతలు, అవసరాలను పరిగణనలోకి తీసుకొని తగిన సౌకర్యాలు కల్పించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

ఉన్నత అర్హతలున్నా పదోన్నతులు కరువు

సింగరేణిలో డిగ్రీలు, పీజీలు, ఇంజినీరింగ్, ఎంబీఏ వంటి ఉన్నత విద్యార్హతలు సాధించిన ఉద్యోగులకు వారి అర్హతలు, అనుభవానికి తగిన పోస్టింగులు, పదోన్నతులు కల్పించక పోవడం వల్ల అసంతృప్తి నెలకొందని వంగ వెంకట్ పేర్కొన్నారు. సంస్థకు మూడు దశాబ్దాల పాటు సేవలందించిన ఉద్యోగి సైతం క్లర్క్‌గానే పదవీ విరమణ చేయాల్సి రావడం ఏమిటని ప్రశ్నించారు. ఉద్యోగుల ప్రతిభను గుర్తించి, వారి విద్యార్హతలు, అనుభవానికి అనుగుణంగా ఉన్నత అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. కోల్ ఇండియాలో అనుసరిస్తున్న విధానాలను పరిశీలించి, అర్హులైన సింగరేణి ఉద్యోగులకు కూడా తగిన పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. క్లరికల్ సిబ్బంది, పీఏలు, ఓఎస్‌లు తమ సమస్యలను బహిరంగంగా చెప్పుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను గుర్తించి న్యాయం చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ

ఉద్యోగులు, కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని వంగ వెంకట్ స్పష్టం చేశారు. సెక్రటేరియల్ సిబ్బంది పదోన్నతులు, క్యాడర్ స్కీమ్ సవరణ, ఖాళీల భర్తీ, పనిభారం తగ్గింపు, ఫర్నిచర్ సౌకర్యాలు, కంప్యూటర్ అలవెన్స్ తదితర సమస్యల పరిష్కారం కోసం త్వరలో సమగ్ర ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు రావాలని, కార్మికవర్గంతో కలిసి హక్కుల సాధన పోరాటాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై యాజమాన్యం నిర్లక్ష్యం చేయకుండా సానుకూలంగా స్పందించి, శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో ఏఐటీయూసీ కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.వి. రమణమూర్తి, ఉపాధ్యక్షులు క్రిస్టోఫర్, ఆఫీస్ బేరర్లు నాగయ్య, మల్లికార్జున్, మధుకృష్ణ తదితరులు పాల్గొన్నారు. సికా నాయకులు నామా శ్రీనివాస్, రామ్‌సింగ్, రాజు, శ్యాం కిరణ్, సంజీవ్, రమణ, దివ్య, సౌజన్యతో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు హాజరయ్యారు.

పెద్దమ్మ తల్లి ఆలయంలో ఘనంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

- మొదటి రోజు పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి వనమా దంపతులు
- ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికిన ఈవో

పాల్వంచ, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి)

: పాల్వంచ కేపీ జగన్నాధపురంలోని శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు పూజల్లో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, ఆయన సతీమణి పద్మావతితో పాటు కిలారు నాగేశ్వరరావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయానికి విచ్చేసిన మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు దంపతులకు ఆలయ ఈవో ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని అందంగా అలంకరించడం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. దుర్గాదేవి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజల



జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. శరన్నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించనున్నారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివస్తున్నారు. ప్రతి సంవత్సరం నిర్వహించే నవరాత్రి ఉత్సవాలతో పెద్దమ్మ తల్లి ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటోంది. ఈ కార్యక్రమంలో వనమా రాఘవేందర్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కనగాల బాలకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీరామ్ మూర్తి, పూసల విశ్వనాథం, 32వ డివిజన్ కార్పొరేటర్ గుగులోతు రాంబాబు, 39వ డివిజన్ కార్పొరేటర్ గోవడ



గుణచరిత్, వై.ఆర్. నాయుడు (డిష్ నాయుడు), దాసరి నాగేశ్వరరావు, కొంచర్ల రామకృష్ణ, ఉర్దూ మాజీ చైర్మన్ అన్వర్ పాషా, 46వ డివిజన్ ఇన్‌చార్జి ముత్యాల ప్రవీణ్, 47వ డివిజన్ ఇన్‌చార్జి మిరియాల అలివేలు, డాబా శంకర్, సేవియా, పెనితల ప్రభాకర్ రెడ్డి, వెంకటనారాయణ, ఏనుగుల శ్రీను, డీఆర్‌కే, పరిటాల సుబ్బారావు, ఆనంద్, తెలంగాణ సురేష్, చంద్రశేఖర్, వెంగళరావు, మాజీ సర్పంచ్ అనిత, తొక్కుగూడెం రమేష్, దంతాలబోర వీర్రాజు, అబిబూ, అచ్చ నరేందర్, మాజీ ఎంపీటీసీ మార్గం గురవయ్య, జగన్నాధపురం నాయకులు వెంకటనారాయణ, పత్తిపాటి శీను, శ్రీశైలం, జగన్నాధపురం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఐక్య కూటమి నేతలకు మంత్రి పొంగులేటి అభినందనలు

ఎనిమిది డిపోల్లో విజయం సాధించడంపై హర్షం

కొత్తగూడెం సింగరేణి (తెలంగాణ వాణి)

: ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ సారథ్యంలోని ఐక్య కూటమి విజయం సాధించడంపై రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ నాయకులను పట్టు శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా పరిధిలోని పది డిపోలకు గాను ఎనిమిది డిపోల్లో, ముఖ్యంగా కొత్తగూడెం డిపోలో ఐక్య కూటమి విజయం సాధించడం అభినందనీయమన్నారు. కుట్రలు, కుతంత్రాలను ఎదుర్కొని సాధించిన ఈ విజయానికి ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ నాయకులు చేసిన కృషి ఫలించిందని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఎన్నికల్లో విజయం సాధించిన యూనియన్ నాయకులు కార్మికులకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ అభినందన



కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఆళ్ల మురళి, ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకులు ఎం.డి. రజాక్, సీఐటీయూ సీనియర్ నాయకులు మల్సూర్, సొసైటీ చైర్మన్ మండే వీరహనుమంతరావు, జిల్లా ఉపాధ్యక్షులు మంద హనుమంతు, కాంగ్రెస్ నాయకులు చింతలపూడి రాజశేఖర్, ఆర్టీసీ నాయకులు నాగేశ్వరరావు, సామ్యూల్, రఫిక్, పోస్ట్ ఆఫీస్ వాసు, జల్లి కిరణ్, కల్లూరి సంపత్, చిమట నాగేశ్వరరావు, కొమరయ్యతో పాటు ఐఎన్‌టీయూసీ--సీఐటీయూ ఐక్య కూటమి నాయకులు పాల్గొన్నారు.





పాత పాల్వంచలో ఘనంగా గ్యాల్మీ పండుగ వేడుకలు

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన కొత్వాల శ్రీనివాసరావు, విమలాదేవి దంపతులు

పాల్వంచ, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి):

పాత పాల్వంచలోని జండాల బజార్‌లో ముస్లిం మత పెద్దలు, మత గురువులు, యువజన సంఘాల ఆధ్వర్యంలో శనివారం రాత్రి గ్యాల్మీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాలకు హస్తముద్రలు వేసి, వాటిని ఊరేగించారు. అనంతరం జెండాలను వెలికితీసి గంధం సమర్పించి, భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ వేడుకల్లో డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, పాత పాల్వంచ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు షేక్ ఖాజామియా, జానీమియా, మహమ్మద్ అలీ, మసీదు కమిటీ ప్రతినిధులు షేక్ ఖయ్యూం, షేక్ షాకీర్, షేక్ అజ్మీత్ అలీ, షేక్ యాకూబ్, షేక్ జాకీర్ హుస్సేన్, షేక్ యాకూబ్ అలీ, షేక్ రహమత్ అలీ, షేక్ జమీర్, జండాల బజార్ యువజన సంఘం సభ్యులతో పాటు చిన్న పండు, బూసి శ్రీను, ఫరీద్, కోడూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి మరణం.. స్నేహానికి నిలువెత్తు నిదర్శనం

- మిత్రుడి దశదిన కార్యక్రమాన్ని తమ బాధ్యతగా నిర్వహించిన స్నేహితులు
- ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలి: డీఎస్పీ ఆదినారాయణ

కొత్తగూడెం, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి):

స్నేహం అంటే బతికున్నప్పుడే కాదు.. మరణించిన తర్వాత కూడా స్నేహితుడి కుటుంబానికి అండగా నిలవడమేనని నిరూపించారు ఆ మిత్రులు. రోడ్డు ప్రమాదంలో స్నేహితుడిని కోల్పోయిన బాధను దిగమింగుకుంటూ, ఆయన దశదిన కార్యక్రమాన్ని తమ బాధ్యతగా భావించి నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం వేపలగడ్డకు చెందిన రూంకు సత్యనారాయణ ఇటీవల ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కుక్క అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. స్నేహితుడి ఆకస్మిక మరణంతో మిత్రులంతా తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఆదివారం నిర్వహించిన ఆయన దశదిన





కార్యక్రమాన్ని స్నేహితులంతా ఒక్కటై విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, పలువురు సీఐలు, ఎస్ఐలు హాజరయ్యారు. తొలుత సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు అనుకోకుండా సంభవించే అవకాశం ఉన్నందున, హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాపాయ ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. సత్యనారాయణ స్నేహితులు ఆయనపై చూపిన ప్రేమాభిమానాలు, ఆయన కుటుంబానికి అండగా నిలిచిన తీరు అభినంద నీయమన్నారు. స్నేహితుడి దశదిన కార్యక్రమాన్ని తమదిగా భావించి నిర్వహించడం నిజమైన స్నేహానికి నిదర్శనమని కొనియాడారు. కష్టసమయాల్లో స్నేహితులకు అండగా నిలుస్తూ, వారి కుటుంబాలకు తోడ్పాటు అందించాలని సూచించారు. అనంతరం సత్యనారాయణ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను డీఎస్పీ పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ జితేందర్, టూటౌన్ సీఐ ఖాసిం, త్రీటౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ గడ్డం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యానగర్‌లో అటుకుల బతుకమ్మ సంబరాలు

తీరొక్క బతుకమ్మలతో కళకళలాడిన జనసేన పార్టీ కార్యాలయ ప్రాంగణం



కొత్తగూడెం, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి)

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు డాక్టర్ జిఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొత్తగూడెం విద్యానగర్ కాలనీలో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాల్లో భాగంగా రెండో రోజు అటుకుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న జనసేన పార్టీ కార్యాలయ ప్రాంగణంలో మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, భక్తిశ్రద్ధలతో పండుగలో పాల్గొన్నారు. అటుకుల బతుకమ్మ వేడుకలకు బతుకమ్మలను తీసుకుని వచ్చిన మహిళలు, ఆడపడుచులు, అమ్మలు, అక్కచెల్లెళ్లకు ట్రస్ట్ సభ్యులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహిళలంతా సంప్రదాయ దుస్తుల్లో, రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలతో వేడుకల్లో పాల్గొనడంతో ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని జిఎస్ఆర్ ట్రస్ట్ సభ్యులు ఆకాంక్షించారు. మహిళల మధ్య సోదరభావం, ఐక్యతను పెంపొందించే ఇలాంటి వేడుకలు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. తొమ్మిది రోజులపాటు కొనసాగే బతుకమ్మ వేడుకల్లో మహిళలంతా పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

సింగరేణిలో శరన్నవరాత్రి శోభ

జీఎం కార్యాలయంలో ప్రత్యేక పూజలు..

భక్తిశ్రద్ధలతో ఉత్సవాల ప్రారంభం



కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి)

సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని గనులు, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు, వివిధ విభాగాల్లో ఆదివారం శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో జీఎం సీహెచ్. వెంకటరమణ దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు నిర్వహించనున్న నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో సింగరేణి గనులు, కార్యాలయాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్మికులు, అధికారులు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజిస్తూ ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

సింగరేణి అభివృద్ధి చెందాలి: జీఎం

ఈ సందర్భంగా జీఎం సీహెచ్. వెంకటరమణ మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులతో సింగరేణి సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్మికులు, అధికారులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. ఈ పూజా కార్యక్రమంలో జీఎంకు ఓఎస్ఓ గోవిందరావు, ఏరియా ఇంజనీర్ రామకృష్ణ, డీజీఎం (సివిల్) రామకృష్ణ, మజ్జి మురళి, కమిటీ సభ్యులు సాగర్, రామకృష్ణ, వినయ్, చంద్రావతి, భరత్, రామ్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

‘ఓటు చోరీ’కి వ్యతిరేకంగా చలో ఢిల్లీ

రాహుల్ గాంధీ పిలుపుతో ఢిల్లీకి భద్రాద్రి జిల్లా యూత్ కాంగ్రెస్ బృందం

జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమానికి తరలింపు

కొత్తగూడెం, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి)



‘ఓటు చోరీ’కి వ్యతిరేకంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన ‘చలో ఢిల్లీ’ నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు ఢిల్లీకి చేరుకున్నారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి యూత్ కాంగ్రెస్ శ్రేణులు ఢిల్లీకి తరలివెళ్లగా, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీకటి కార్తీక్ ఆధ్వర్యంలో నాయకుల బృందం యూత్ కాంగ్రెస్ కేంద్ర కార్యాలయం, ఏఐసీసీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా జాతీయ నాయకులను కలిసి తమ సంఘీభావాన్ని తెలిపినట్లు యూత్ కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేస్తూ, ఓటు హక్కు పరిరక్షణ కోసం తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో యువత హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కాపాడటం, దేశ సమగ్రత కోసం భద్రాద్రి జిల్లా యూత్ కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ అధ్యక్షులు పాల సత్యనారాయణ రెడ్డి, ఎడారి ప్రదీప్, చెరుకుపల్లి నరేందర్, పాలకుర్తి సుమిత్, జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లి ప్రణయ్, మండల అధ్యక్షుడు వంకుడోత్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణియులకు లాభాల బోనస్ లేనట్లేనా!

- లాభాలు రూ.1,800 కోట్లకే పరిమితమనే ప్రచారంపై కార్మికుల్లో ఆందోళన
- ఆగస్టులోనే లాభాలు ప్రకటించే ఆనవాయితీ ఏమైంది?
- దసరా బోనస్ ప్రకటనపై స్పష్టత ఏదీ?
- గుర్తింపు సంఘాలు, యాజమాన్యం స్పందించేదెప్పుడు?





కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి)

దేశంలోని ప్రముఖ ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థ సింగరేణి కాలరీస్‌లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు ఈ ఆర్థిక సంవత్సరం లాభాల బోనస్ చెల్లింపులపై సందిగ్ధత నెలకొంది. సంస్థకు వచ్చిన లాభాలు ఎంత? కార్మికులకు ఎంత శాతం బోనస్ ప్రకటించనున్నారు? ప్రకటించిన బోనస్ సకాలంలో అందుతుందా? అనే ప్రశ్నలు కార్మిక వర్గంలో చర్చనీయాంశంగా మారాయి. ఈ అంశాలపై సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వెలువడకపోవడంతో కార్మికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో సింగరేణికి రూ.6,000 కోట్లకు పైగా లాభాలు వచ్చినట్లు ప్రచారం ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లాభాలు సుమారు రూ.1,800 కోట్లకే పరిమితమయ్యాయనే చర్చ కార్మిక వర్గంలో వినిపిస్తోంది. అయితే ఈ గణాంకాలపై అధికారిక ప్రకటన లేకపోవడంతో వాస్తవ లాభాలపై స్పష్టత కొరవడింది. సంస్థ లాభాల వివరాలను వెల్లడించకపోవడం, బోనస్ చెల్లింపులపై భరోసా ఇవ్వకపోవడం కార్మికుల్లో అనుమానాలకు తావిస్తోంది.

రెండు నెలల ముందే లాభాల ప్రకటన చేసే ఆనవాయితీ ఏమైంది?

సింగరేణి సంస్థకు సంబంధించిన వార్షిక లాభాల వివరాలను గతంలో ఆగస్టు నెలలోనే వెల్లడించే ఆనవాయితీ ఉండేదని కార్మికులు గుర్తుచేస్తున్నారు. అయితే 2026లోనూ లాభాల వివరాలపై స్పష్టత లేకపోవడం చర్చకు దారితీస్తోంది. లాభాల ప్రకటన ఆలస్యం కావడానికి కారణాలేమిటి? ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది? కార్మికులకు బోనస్ చెల్లింపులపై యాజమాన్యం ఆలోచన ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. లాభాల వివరాలను ముందుగానే వెల్లడిస్తే కార్మికులకు బోనస్‌పై స్పష్టత వస్తుందని, అనవసర అనుమానాలకు తెరపడుతుందని కార్మిక వర్గం అభిప్రాయపడుతోంది. ఈ విషయంలో యాజమాన్యం తక్షణమే స్పందించాలని కోరుతోంది.

గుర్తింపు సంఘాల మౌనం ఎందుకు?

సింగరేణిలో ప్రధాన గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్, ప్రాంతీయ గుర్తింపు సంఘంగా ఉన్న ఐఎన్‌టీయూసీ అనుబంధ యూనియన్ నాయకులు లాభాల బోనస్ అంశంపై స్పష్టమైన ప్రకటన చేయకపోవడంపై కార్మికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. గుర్తింపు సంఘం ఎన్నికల సమయంలో కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, మెరుగైన ప్రయోజనాలు కల్పిస్తామని హామీలు ఇచ్చిన నాయకులు.. ఇప్పుడు బోనస్ అంశంపై తమ వైఖరిని వెల్లడించాలని కార్మికులు కోరుతున్నారు. కార్మికుల ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశంపై యూనియన్లు చొరవ తీసుకుని యాజమాన్యంతో చర్చించాలని డిమాండ్ చేస్తున్నారు.

బ్యాంకు రుణాలపై ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చిందా?

సింగరేణి ఆర్థిక పరిస్థితి, నిధుల లభ్యతపై కూడా కార్మిక వర్గంలో చర్చ జరుగుతోంది. సంస్థ బ్యాంకు రుణాల కోసం ప్రయత్నిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో బాండ్ల రూపంలో బ్యాంకుల్లో ఉన్నట్లు చెబుతున్న సుమారు రూ.3,500 కోట్ల నిధుల వినియోగంపై కూడా కార్మికుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిధులకు సంబంధించిన వివరాలు, సంస్థ ప్రస్తుత ఆర్థిక స్థితిగతులపై యాజమాన్యం స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు. అయితే బ్యాంకు రుణాలు, బాండ్ల నిధుల వినియోగం, ప్రస్తుత లాభాలపై వినిపిస్తున్న అంశాలకు అధికారిక ధ్రువీకరణ అవసరం. యాజమాన్యం వాస్తవ గణాంకాలను వెల్లడిస్తేనే సంస్థ ఆర్థిక పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

దసరా బోనస్‌పై కార్మికుల ఎదురుచూపులు

దసరా పండుగ నేపథ్యంలో కార్మిక వర్గానికి బోనస్ చెల్లింపులపై స్పష్టత కోసం సింగరేణి ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. బోనస్ ప్రకటించినట్లు సమాచారం ఉన్నప్పటికీ, దాని చెల్లింపులు ఎప్పుడు జరుగుతాయి? ఏ ప్రాతిపదికన చెల్లిస్తారు? లాభాల వాటా బోనస్‌పై యాజమాన్యం నిర్ణయం ఏమిటి? అనే అంశాలపై అధికారిక వివరాలు వెలువడాల్సి ఉంది. సింగరేణి అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు సంస్థ ఆర్థిక పరిస్థితిపై నిజమైన వివరాలు తెలియజేయడంతో పాటు, బోనస్ చెల్లింపులపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కార్మికులు కోరుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం లాభాల బోనస్ విషయంలో యాజమాన్యం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? గుర్తింపు సంఘాలు కార్మికుల తరఫున ఏ మేరకు ఒత్తిడి తెస్తాయి? అన్నది వేచి చూడాల్సి ఉంది.

పట్టభద్రుల ఓటు హక్కు నమోదు కోసం జనసేన ప్రత్యేక కార్యక్రమం

అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి





కొత్తగూడెం, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి)

పట్టభద్రుల గొంతుకను శాసనమండలిలో బలంగా వినిపించేందుకు, అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేందుకు జనసేన పార్టీ నాయకులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ఇందులో భాగంగా కొత్తగూడెం నియోజకవర్గంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం సమీపంలో పట్టభద్రుల శాసనమండలి ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖమ్మం--నల్గొండ--వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ జనసేన అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కొత్తగూడెం నియోజకవర్గ ఎంఎల్‌సీ కోఆర్డినేటర్లు తనూజ రెడ్డి, వినయ్ విప్లవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అర్హులైన పట్టభద్రుల నుంచి అవసరమైన ధ్రువపత్రాలను సేకరించి, ఆన్‌లైన్ ద్వారా ఓటరు నమోదుకు దరఖాస్తులు సమర్పించారు. పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం ద్వారా తమకు లభించిన ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవాలని జనసేన నాయకులు సూచించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమని, అర్హత ఉన్నప్పటికీ నిర్లక్ష్యం కారణంగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోకపోతే ఎన్నికల్లో తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ముందుకు వచ్చి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల సమస్యలు, ఉద్యోగ అవకాశాలు, విద్యా రంగానికి సంబంధించిన సమస్యలు పరిష్కారం కావాలంటే జనసేన తరపున బరిలో నిలిచిన డాక్టర్ గడల శ్రీనివాస రావు ను గెలిపించాలని, అందుకు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమిష్టిగా కృషి చేయాలని, ఓటరు నమోదు విషయంలో యువత, ఉద్యోగులు, ఇతర అర్హులైన పట్టభద్రులకు అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ముఖ్య నాయకులు ఎం.డి. సాధిక్ పాషా, సాయి అనిత్, బాలకృష్ణ, వనమా రాము, రమేష్, సురేష్, తులసి రామ్, వీర మహిళలు కుమ్మరి సౌజన్య, తమ్మ మౌనికతో పాటు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పూలవనంలో చిగురించిన ఆశల బతుకమ్మ!

- ఖమ్మంలో తలసేమియా చిన్నారుల కోసం ప్రత్యేక వేడుకలు
- రక్తదాతలే మా ప్రాణదాతలు.. గౌరమ్మా బంగారు బతుకునివ్వమ్మా!



ఖమ్మం, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి):

“బతుకమ్మా.. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకు ఇవ్వమ్మా.. ఉయ్యాలో!” అంటూ తలసేమియాతో పోరాడుతున్న చిన్నారులు పాడిన పాటలు, ఆడిన ఆటలు అందరినీ కదిలించాయి. నిత్యం మందులు, సూది మందులు, రక్తమార్పిడి చికిత్సలతో కాలం గడిపే ఆ చిన్నారులు బతుకమ్మ పండుగ వేళ ఆనందంగా గడిపారు. పూల పండుగ వారి జీవితాల్లో ఆశలను చిగురింపజేయగా, చిన్నారుల చిరునవ్వులు అక్కడి వాతావరణాన్ని ఆనందమయం చేశాయి.సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మంలోని వైరా రోడ్డులో ఉన్న రితన్య ఆసుపత్రి ప్రాంగణంలో ఆదివారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులు తమ తల్లిదండ్రులతో కలిసి రంగురంగుల పూలను సేకరించి, స్వయంగా భారీ బతుకమ్మను పేర్చారు. సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై వచ్చిన చిన్నారులు బతుకమ్మకు, గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, వలయాకారంగా తిరుగుతూ ఆటపాటలతో సందడి చేశారు.

రక్తదాతలకు కృతజ్ఞతలు తెలిపిన చిన్నారులు

ఈ వేడుకలు కేవలం ఆటపాటలకే పరిమితం కాలేదు. తమకు క్రమం తప్పకుండా రక్తదానం చేస్తూ ప్రాణాలు నిలబెడుతున్న దాతలను స్మరించుకుని చిన్నారులు భావోద్వేగానికి గురయ్యారు. రక్తదాతలు తమకు ప్రాణదాతలని, వారు ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో ఉండాలని గౌరమ్మను ప్రార్థించారు. చిన్నారుల కృతజ్ఞతాభావం అక్కడున్న వారిని కదిలించింది.తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు క్రమం తప్పకుండా రక్తం అవసరమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో రక్తదాతలు అందించే సహకారం వారి చికిత్సలో కీలక పాత్ర పోషిస్తోంది. రక్తదానం ద్వారా చిన్నారుల జీవితాల్లో ఆశలు నింపుతున్న దాతల సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.

చిన్నారుల్లో ఆత్మస్థైర్యం నింపిన వైద్యులు, నిర్వాహకులు

ఈ మానవీయ వేడుకల్లో ప్రముఖ వైద్యులు డాక్టర్ డి. నారాయణమూర్తి, సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకురాలు అనిత, సంస్థ బాధ్యులు ప్రొద్దుటూరి పావని, పి. ఉదయభాస్కర్, పి. రవిచందర్ తదితరులు పాల్గొన్నారు. చిన్నారులతో కలిసి బతుకమ్మ ఆడుతూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపారు. అనారోగ్య సమస్యలతో పోరాడుతున్న చిన్నారులకు ఆనందాన్ని పంచడం, వారి మానసిక ధైర్యాన్ని పెంపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు.పూల పండుగ సందర్భంగా చిన్నారుల ముఖాల్లో విరిసిన చిరునవ్వులు, వారి ఆశలు, రక్తదాతల పట్ల వారు చూపిన కృతజ్ఞతాభావం ఈ వేడుకకు ప్రత్యేకతగా నిలిచాయి. ఈ ఆనందం చిన్నారుల జీవితాల్లో ఎల్లప్పుడూ నిలవాలని, వారు ఆరోగ్యంగా ఎదిగి సంతోషకరమైన జీవితాన్ని గడపాలని నిర్వాహకులు, పాల్గొన్నవారు ఆకాంక్షించారు.



సెక్యూరిటీ చెక్‌పోస్టులో మహిళా సిబ్బంది పనితీరుపై డైరెక్టర్ సంతృప్తి

విధి నిర్వహణలో అప్రమత్తతకు అభినందనలు

మహిళలకు మరిన్ని బాధ్యతలు అప్పగించాలి: డైరెక్టర్ (పి.పి.) కె. వెంకటేశ్వర్లు



టేకులపల్లి, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి)

సింగరేణి సంస్థలో మహిళా సిబ్బందికి మరిన్ని బాధ్యతలు అప్పగించి, పురుషులతో సమానంగా విధులు నిర్వహించే అవకాశాలు కల్పించాలని సంస్థ డైరెక్టర్ (పి.పి.) కె. వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం కోయగూడెం ప్రాంతాన్ని సందర్శించిన ఆయన, ఏరియా సెక్యూరిటీ విభాగానికి చెందిన చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న మహిళా జనరల్ అసిస్టెంట్ల పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చెక్‌పోస్టు వద్ద లారీల రాకపోకలకు సంబంధించిన వివరాల నమోదు, డ్రైవర్ల పేర్లు, డ్రైవింగ్ లైసెన్స్ వివరాలు, లారీ నంబర్ల నమోదు, కంప్యూటర్ వ్యవస్థలో సమాచారాన్ని నమోదు చేసే విధానంపై మహిళా సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బ్రీత్ అనలైజర్ ద్వారా డ్రైవర్లను పరీక్షించిన అనంతరమే లారీలను లోపలికి అనుమతిస్తున్న తీరును పరిశీలించారు. బొగ్గు లోడ్‌తో వచ్చే లారీల బరువు, బొగ్గు పరిమాణం తదితర వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న విధానాన్ని సమీక్షించారు.

మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించాలి

చెక్‌పోస్టులో మహిళా సిబ్బంది అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తున్న తీరుపై డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు. సింగరేణి సెక్యూరిటీ విభాగంలో కీలకమైన ప్రాంతాల్లో మహిళలు సమర్థవంతంగా విధులు నిర్వర్తించడం అభినందనీయమని పేర్కొన్నారు. సర్వే విభాగంతో పాటు ఇతర విభాగాల్లో ఖాళీలు ఉన్నట్లయితే మహిళా సిబ్బందికి కూడా అవకాశాలు కల్పించాలని ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ వి. కృష్ణయ్యకు సూచించారు. మహిళలకు మరిన్ని బాధ్యతలు అప్పగించి, వారి సామర్థ్యాన్ని నిరూపించుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. అనంతరం కోయగూడెం ప్రాంతంలోని పిట్-3ను సందర్శించిన డైరెక్టర్.. టెండర్ ప్రక్రియకు సంబంధించిన పరిస్థితులు, ఇతర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కే.ఓ.సి. పీవో మాధవరావు, సర్వే అధికారి రామమూర్తి, కే.ఓ.సి. మేనేజర్ శ్రీనివాస్, ఏరియా సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ నవరాత్రి వేడుకల్లో ఎమ్మెల్యే కోరం కనకయ్య

కోయగూడెంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు



టేకులపల్లి, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి)

దుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామంలో నిర్వహించిన అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో ఇల్లందు నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖశాంతులతో జీవించాలని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కోయగూడెం సర్పంచ్ కోరం సుభాష్ చంద్రబోస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మండలవ్యాప్తంగా నవరాత్రి సందడి

టేకులపల్లి మండలంలో దుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. టేకులపల్లిలోని కోదండ రామాలయం, బస్టాండ్ సెంటర్, కుప్పుస్వామి కాలనీ, వీరబ్రహ్మేంద్రస్వామి వీధితో పాటు బోడు గ్రామంలో అమ్మవారి మండపాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలతో ఆయా ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

సెలవు రోజుల్లోనూ సాగునీటి సరఫరాపై పర్యవేక్షణ



తల్లాడ, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి)

ఆదివారం సెలవు రోజైనా రైతులకు సాగునీరు సక్రమంగా అందించేందుకు తల్లాడ నీటిపారుదల శాఖ అధికారులు విధులు నిర్వహించారు. సబ్ డివిజన్-3 పరిధిలోని మండలంలోని అన్ని మేజర్లకు నీరు చేరేలా డీఈ ఝాన్సీ, ఏఈ అరుణ లస్కర్లతో వాల్వులు తెరిపిస్తూ దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో లస్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బోడు పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ వార్షిక తనిఖీ

- **సైబర్ నేరాల నియంత్రణ, గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలి**
- **బాధితులతో మర్యాదగా వ్యవహరించాలి.. విధుల్లో క్రమశిక్షణ పాటించాలి**

టేకులపల్లి, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి)

బోడు పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ యు. వెంకన్నబాబు ఆదివారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, పరిసరాలు, భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది విధుల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) సిబ్బంది విధులు, గార్డు నిర్వహణను తనిఖీ చేయడంతో పాటు పోలీస్ సిబ్బంది కిట్‌లను పరిశీలించి, వారితో పరేడ్ నిర్వహించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడిన డీఎస్పీ.. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెరుగుతున్న సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీ ఆదేశించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, ఇతర మాదకద్రవ్యాల కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. విశ్వసనీయ సమాచారం సేకరించి, మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు, రౌడీషీటర్లు, అసాంఘిక శక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు.



బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి

పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓపికగా వినాలని, వారితో గౌరవప్రదంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని డీఎస్పీ తెలిపారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా స్పందిస్తూ, చట్టబద్ధమైన పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు.

5ఎస్ విధానం.. క్రమశిక్షణ తప్పనిసరి

పోలీస్ స్టేషన్‌లో పరిశుభ్రత, రికార్డులు, సామగ్రి నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని, 5ఎస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.



సిబ్బంది తమ కిట్‌లను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలని, పరేడ్ ద్వారా శారీరక దృఢత్వం, సమన్వయం, విధి నిర్వహణలో అప్రమత్తత పెంపొందించుకోవాలని సూచించారు. స్వీయ క్రమశిక్షణ, సమయపాలన, విధి నిబద్ధత పోలీస్ శాఖకు పునాది అని పేర్కొన్న డీఎస్పీ.. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా ప్రతి ఒక్కరూ వృత్తిపరమైన నైపుణ్యంతో విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రజల రక్షణ, నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల నివారణలో సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ తనిఖీలో టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ, బోడు ఎస్ఐ రాజమౌళి, ఆలపల్లి ఎస్ఐ సోమేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లాడ బతుకమ్మ సంబరాలకు సర్పంచ్ ప్రత్యేక శ్రద్ధ

- **ఆడపడుచులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు**
- **వెదుళ్ల చెరువు నిమజ్జన ఘాటు పనులను పరిశీలించిన పెరిక నాగేశ్వరరావు**

తల్లాడ, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి)

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను తల్లాడ పట్టణంలో ఘనంగా నిర్వహించుకునేందుకు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పండుగకు వచ్చే ఆడపడుచులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం పట్టణంలోని వెదుళ్ల చెరువు బతుకమ్మ నిమజ్జన ఘాటు వద్ద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. మహిళలు, యువతులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించుకునేందుకు అవసరమైన సౌకర్యాలపై సంబంధిత సిబ్బందితో చర్చించారు. నిమజ్జన ఘాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.



తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

ఈ సందర్భంగా సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ఆత్మీయతకు, సాంస్కృతిక వైభవానికి నిదర్శనమన్నారు. మహిళలు, యువతులు కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

నిమజ్జన ఘాటు వద్ద మెరుగైన సౌకర్యాలు

బతుకమ్మ నిమజ్జనానికి వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామపంచాయతీ తరఫున అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు. నిమజ్జన ఘాటు పరిసరాల పరిశుభ్రతతో పాటు పండుగ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలందరూ బతుకమ్మ పండుగను సంతోషంగా, సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని ఆయన కోరారు.



కాంగ్రెస్ అనుబంధ సంఘాల నూతన కమిటీలకు ఘన సన్మానం

గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: గొడుగునూరు లక్ష్మారెడ్డి

తల్లాడ, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి)

తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ అనుబంధ సంఘాల నూతన కమిటీల సభ్యులకు ఘనంగా సన్మానం నిర్వహించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నూతన అధ్యక్షులు, కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం నిర్ణయాలకు కట్టుబడి, గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

నూతన కమిటీల అధ్యక్షులు

- బీసీ సెల్: కోడూరు రాము
- ఎస్సీ సెల్: తాళ్ల వెంకటేశ్వర్లు
- ఎస్టీ సెల్: బానోతు కృష్ణ
- మైనారిటీ సెల్: ఎస్.కె. నిజాముద్దీన్
- కిసాన్ సెల్: అయిలూరి సత్యనారాయణ రెడ్డి
- మహిళా కాంగ్రెస్: ఆధురి పుష్పావతి
- సేవాదళ్: కటికి ప్రసాదు

నూతన బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మన ఓటు.. మన గొంతుక

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమకారుల ప్రాతినిధ్యం ఉండాలి: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం

తల్లాడ, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి)

రానున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో డిగ్రీ అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 'మన ఓటు.. మన గొంతుక' నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను ఖమ్మం సమీపంలో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ నాయకత్వంలో నిర్వహించిన ఖమ్మం జిల్లా పర్యటనలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారుల గొంతుక శాసనమండలిలో వినిపించాలంటే పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగస్వాములు కావాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ డాక్టర్ పాలకుర్తి కృష్ణ, ఖమ్మం జిల్లా మీడియా ఇన్‌చార్జి మంద వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.ఎస్. రెడ్డి, జోగు అంజన్న, రాష్ట్ర నాయకులు జగన్ యాదవ్, నరసింహ, భాస్కర్, సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి నారాపోగు ప్రసాద్, రేగల శ్రీనివాసరావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి కిన్నెర నాగేందర్, మహమ్మద్ అయూబ్, అబ్దుల్ హబీబ్, పాలేరు ఇన్‌చార్జి ఎదురుగట్ల చిట్టిమల్లు, నిమ్మతోట రోజా తదితర ఉద్యమకారులు, మండల, గ్రామ శాఖల నాయకులు పాల్గొన్నారు.

బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా కోడూరు రాము

అంచెలంచెలుగా ఎదిగిన బీసీ నేత.. వ్యాపారంతో పాటు రాజకీయాల్లోనూ రాణింపు





తల్లాడ, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి)

కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ తల్లాడ మండల అధ్యక్షుడిగా తల్లాడ పట్టణానికి చెందిన కోడూరు రాము నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి, మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. కోడూరు రాము గత 20 ఏళ్లుగా క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతున్నారు. తొలుత తెలుగుదేశం పార్టీలో వాణిజ్య విభాగం మండల కోశాధికారిగా, అనంతరం బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. వ్యాపార రంగంలో అభివృద్ధి సాధిస్తూనే రాజకీయాల్లోనూ తనదైన గుర్తింపు తెచ్చుకుంటున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుచరుడిగా, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దుండేటి వీరారెడ్డికి సన్నిహితుడిగా కొనసాగుతున్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్‌లతోనూ ఆయనకు పరిచయాలు ఉన్నాయి. ఈ సందర్భంగా కోడూరు రాము మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, బీసీల ఐక్యతకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

రైతుల విద్యుత్ కష్టాలపై బీజేపీ కిసాన్ మోర్చా ధర్నా

తడ్కల్‌ను మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్



తడ్కల్, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి)

తడ్కల్ గ్రామంలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ కోతలను నిరసిస్తూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా సంగారెడ్డి జిల్లా కార్యదర్శి కమ్మరి నరేందర్ పాల్గొన్నారు. తరచూ విద్యుత్ కోతలతో పంటలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని నాయకులు పేర్కొన్నారు. వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తొలగించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. అలాగే, తడ్కల్‌ను మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై గతంలో నిరవధిక సమ్మె చేపట్టినా పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తడ్కల్ మండల కేంద్రంగా ఏర్పాటైతే పరిసర గ్రామాల ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువవుతాయని పేర్కొంటూ, ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరిసర గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ ఏర్పాట్లకు శ్రీకారం

డిగ్రీ కళాశాల మైదానం, నాయిని చెరువు వద్ద పనులు ప్రారంభం



జమ్మికుంట, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి)

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకల నిర్వహణకు జమ్మికుంట పట్టణంలో ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం, నాయిని చెరువు వద్ద మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డుల మహిళలు సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేపడుతున్నట్లు చైర్మన్ తెలిపారు. ప్రకృతిని, పూలను పూజించే బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. వేడుకలను సంప్రదాయబద్ధంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించేందుకు మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక గర్జన సభను విజయవంతం చేయండి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ పిలుపు

మందమర్రి, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి)

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ లక్ష్యంగా ఈ నెల 14న గోదావరిఖనిలో నిర్వహించనున్న కార్మిక గర్జన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పిలుపునిచ్చారు.ఆదివారం మందమర్రిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సభకు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. కార్మికులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. సభ ఏర్పాట్లు, జన సమీకరణలో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని



సూచించారు. ఈ సమావేశంలో మేడిపల్లి సంపత్, ఓ. రాజశేఖర్, బెల్లం అశోక్, బండారు సూరిబాబు, ఎం.డి. అబ్బాస్, కొంగల తిరుపతిరెడ్డి, మద్ది శంకర్, బోరిగం వెంకటేష్, పంజాల ఈశ్వర్, భూపెల్లి కనకయ్య, కనకం రవి, పల్లె నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు కోతలతో ఎండిపోతున్న పంటలు

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ నేత కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి విమర్శలు

హుస్నాబాద్, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి ఆర్‌సీ)

వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా చేయకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని బీజేపీ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి విమర్శించారు. విద్యుత్ కోతలను నిరసిస్తూ బీజేపీ హుస్నాబాద్ నియోజకవర్గం ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించి, ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్న రైతులు విద్యుత్ కోతలతో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించాలని, ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



రైతులకు న్యాయం జరిగే వరకు బీజేపీ వారి పక్షాన పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకటేశం, జిల్లా ఉపాధ్యక్షుడు మాచర్ల కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పైడిపల్లి పృథ్వీరాజ్ గౌడ్, వివిధ మండలాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

వేల్పుల లక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ

చిట్యాల, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి)

చిట్యాల మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో 11వ వార్డు సభ్యురాలు వేల్పుల లక్ష్మి (పూలక్క) ఆధ్వర్యంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాలనీలోని మహిళలు, చిన్నారులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, గౌరమ్మను పూజిస్తూ మహిళలు





భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహిస్తారని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు సాగే బతుకమ్మ సంబరాలు చివరి రోజు సద్దుల బతుకమ్మతో ముగుస్తాయని పేర్కొన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా సాధన ఉద్యమ నాయకులకు ఘన సన్మానం

- **జిల్లా ఏర్పాటు పోరాటంలో గొంటి శంకర్ కీలక పాత్ర**
- **జేఏసీ కో-కన్వీనర్ సేవలకు గుర్తింపు..**

వేములవాడకు గర్వకారణం

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 11 (తెలంగాణ వాణి ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల జిల్లా సాధన కోసం జరిగిన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జేఏసీ నాయకులను సిరిసిల్లలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వేములవాడకు చెందిన జిల్లా సాధన ఉద్యమ జేఏసీ కో-కన్వీనర్, న్యాయవాది గొంటి శంకర్‌ను ప్రత్యేకంగా సత్కరించారు. వేములవాడ బార్ అసోసియేషన్ ప్రస్తుత ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న గొంటి శంకర్ జిల్లా ఏర్పాటు కోసం జరిగిన పోరాటంలో చురుకుగా పాల్గొని తనవంతు కృషి చేశారు.కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, చల్మెడ లక్ష్మీ నరసింహారావు, తుల ఉమా, మాజీ జెడ్పీ చైర్మన్‌తో పాటు పలువురు నాయకుల సమక్షంలో జేఏసీ నాయకులను సన్మానించారు.

జిల్లా సాధన కోసం అలుపెరగని పోరాటం

రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటు సాధ్యం కాదని పలువురు భావించినప్పటికీ, వివిధ సాంకేతిక అడ్డంకులను అధిగమిస్తూ ఉద్యమకారులు తమ పోరాటాన్ని కొనసాగించారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. వేములవాడలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, రాజన్న సిరిసిల్ల జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ నాయకులు, ప్రజలు ఐక్యంగా ఉద్యమించారని పేర్కొన్నారు. ఆ ఉద్యమంలో జేఏసీ నాయకుల కృషి కీలకంగా నిలిచిందని తెలిపారు.

జిల్లా ఏర్పాటుతో అభివృద్ధికి కొత్త బాటలు

రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పడిన అనంతరం విద్యా, వైద్య, వ్యవసాయ రంగాల్లో అభివృద్ధికి మరిన్ని అవకాశాలు ఏర్పడ్డాయని నాయకులు పేర్కొన్నారు. వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల, వ్యవసాయ పరిశోధనకు సంబంధించిన విద్యా సదుపాయాలు, వంద పడకల ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య వసతులు వంటి అంశాలు జిల్లా అభివృద్ధిలో ప్రాధాన్యత సంతరించుకున్నాయని వివరించారు.

ఉద్యమకారులకు గుర్తింపు అభినందనీయం

జిల్లా సాధన కోసం కృషి చేసిన ఉద్యమ నాయకులను గుర్తించి సన్మానించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో వేములవాడకు చెందిన న్యాయవాది గొంటి శంకర్‌కు ప్రత్యేక గుర్తింపు లభించడం పట్టణ ప్రజలకు





గర్వకారణమని అభిప్రాయపడ్డారు.
ప్రజలు ఐక్యంగా ఉద్యమిస్తే అసాధ్యమనుకున్న లక్ష్యాలను సైతం సాధించవచ్చని రాజన్న సిరిసిల్ల జిల్లా సాధన ఉద్యమం చాటిచెప్పిందని నాయకులు పేర్కొన్నారు.

బాలమిత్ర అవార్డులు కోసం దరఖాస్తుల ఆహ్వానం.

వలస సుభాష్ చంద్రబోస్.

హుస్నాబాద్ అక్టోబర్ 11 (తెలంగాణ వాణి ఆర్ సి)

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా చిన్నారి బాలికలకు శుభాకాంక్షలు తెలియజేసిన బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ప్రముఖ సంఘ సేవకులు వలస సుభాష్ చంద్రబోస్. వారు మాట్లాడుతూ ఆడపిల్లలు సమాజానికి మణిహారాలని, ఆడపిల్లలుపుట్టనిద్దాం బతకనిద్దాం చదవ నిద్దాం ఎదగనిద్దాం అని పిలుపునిచ్చారు. బాలల దినోత్సవం నవంబర్ 14 న, రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు క్రీడారంగము సాంస్కృతిక రంగము వివిధ రంగాలలో సర్టిఫికెట్లు వచ్చిన వారికి దరఖాస్తు లకు ఆహ్వానం పలుకుతున్నట్టు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో బాలమిత్ర అవార్డులు ఇవ్వనున్నట్టు తెలిపారు. బాలికలు రానున్న రోజుల్లో తల్లిదండ్రుల కలలు నిజం చేసేందుకు ఉన్నతమైన వ్యక్తులుగా తయారు కావాలని ఆకాంక్షించారు. చిన్నారి బాలికలు సెల్ ఫోన్లకు అలవాటు పడవద్దని, బాలికలు కృషి పట్టదలతో చదవాలని అన్నారు బాలికల కోసం కేంద్ర ప్రభుత్వం భేటీ బచావో బేటి పడావో అని కార్యక్రమం శ్రీకారం చుట్టిందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం బాలికల రక్షణ కోసం షీ టీం కళ్యాణ లక్ష్మి పథకాలుతీసుకువచ్చిందని పేర్కొన్నారు. బాలికలు క్రీడారంగంలో సాంస్కృతిక రంగంలో ఎదగాలని ఆకాంక్షించారు.



TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక

మొగాంబో మోదీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారు

ప్రధాని నరేంద్ర మోదీపై లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. మోదీని మొగాంబోగా అభివర్ణిస్తూ– ఆయన భారత ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. దేశానికి చేసిన నేరాలకు ప్రధాని మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంపై నేరుగా దాడి చేయడంతో పాటు ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని రాహుల్ విమర్శించారు. చెన్నైలో శనివారం యువతతో ఛాత్రోన్ కీ గూంజ్ (విద్యార్థుల గళం) ఆరో ఎడిషన్ కార్యక్రమంలో మాట్లాడిన రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రజల గొంతులను అణచివేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. దేశ రాజధాని దిల్లీలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను ప్రస్తావిస్తూ – నగరమంతా మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, పోలీసులు విద్యార్థులపై దాడులు చేశారని రాహుల్ గాంధీ ఆరోపించారు. బీజేపీ కూడా తన అనుచరుల ద్వారా విద్యార్థులపై దాడులు చేయించిందని విమర్శించారు.

'మోదీ సమస్య ఏంటంటే– ఆట ముగిసిపోయిందని ఆయన అర్థం చేసుకోవడం లేదు. గత 15 ఏళ్లుగా ఆయన సాగిస్తున్న నాటకం ముగింపు దశకు చేరుకుంది. దేశానికి చేసిన నేరాలకు మోదీ మూల్యం చెల్లించేలా మేం చేస్తాం'

ఇక్కడ రాహుల్ గాంధీ ప్రధానిని మొగాంబోతో పోల్చారు. ప్రముఖ బాలీవుడ్ చిత్రం మిస్టర్ ఇండియాలోని విలన్ పాత్ర పేరు మొగాంబో. దివంగత నటుడు అమ్రిష్ పురి పోషించిన ఆ పాత్రను ప్రస్తావిస్తూ మొగాంబో మోదీ అని అన్నారు. రాహుల్ దీని గురించి మాట్లాడే సమయంలో వెనుక స్క్రీన్‌పై 1987లో విడుదలైన మిస్టర్ ఇండియా సినిమాలోని దృశ్యాన్ని కూడా ప్రదర్శించారు. అందులో అమ్రిష్ పురి ముఖానికి



బదులుగా మోదీ ముఖాన్ని మార్ఫింగ్ చేసి చూయించారు.

తమిళ సంస్కృతి, భాషపై మోదీ దాడి చేస్తున్నారు: రాహుల్

ఇక ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా– తమిళనాడు సంస్కృతి, భాష సహా చరిత్రపైనా దాడి ప్రారంభించారని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా ఆరోపించారు. తమిళనాడుపై హిందీని రుద్దుతామని అమిత్ షా బహిరంగంగా చెబుతున్నారని విమర్శించారు. కొత్త జాతీయ విద్యా విధానం (చీజ్రా) ద్వారా 3 భాషల విధానాన్ని అమలు చేస్తూ విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్నే అణచివేస్తున్నారని రాహుల్ మండిపడ్డారు. తమిళనాడును ఇంకా నియోజకవర్గాల పునర్విభజన (డీ లిమిటేషన్) ప్రక్రియ ద్వారా శిక్షించేందుకు కూడా ప్రయత్నిస్తున్నారని రాహుల్ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

'తమిళ సంస్కృతి, భాష, చరిత్రపై మోదీ దాడి చేయడాన్ని మేం అనుమతించబోం. ఆయన తమిళనాడును ముట్టుకోలేరు' అని స్పష్టం చేశారు. తమిళనాడు నేలపైకి రావడం తనకు గౌరవంగా ఉందన్న రాహుల్, ఈ రాష్ట్ర ప్రజల నుంచి తాను తరచూ కొత్త విషయాలు నేర్చుకుంటానని తెలిపారు. ఈ క్రమంలోనే తమిళనాడు సామాజిక సంస్కర్త పెరియార్ బోధనలను రాహుల్ గుర్తుచేశారు. ఇతరులు చెప్పారని ఏ విషయాన్నీ గుడ్డిగా అనుసరించకూడదని, ప్రతి అంశాన్నీ విశ్లేషించి, ప్రశ్నించి తెలుసుకోవాలని పెరియార్ సూచించినట్లు చెప్పారు.

విద్యార్థులు దేనికీ భయపడొద్దు

ఇక దేనికి భయపడవద్దనేదే విద్యార్థులకు తాను చెప్పదలుచుకున్న ప్రధాన సందేశం అని రాహుల్ గాంధీ అన్నారు. ప్రశ్నించడం, ఆసక్తితో తెలియని విషయాలను తెలుసుకోవాలనుకోవడం సమాజ పురోగతికి పునాదులని, ప్రజాస్వామ్యం కూడా ప్రశ్నించే తత్వం నుంచే పుట్టిందని తెలిపారు. విద్యార్థులు స్వేచ్ఛగా ప్రశ్నలు అడగాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు భయపడకుండా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంపై దాడి చేసిన వారందరినీ న్యాయస్థానం ముందు నిలబెడతామని పేర్కొన్నారు. ఇక చెన్నైకి ముందు కోటా, దేహ్రాదూన్, ప్రయాగ్ రాజ్, పుణె, ఇందోర్ నగరాల్లో ఛాత్రోన్ కీ గూంజ్ కార్యక్రమాలను నిర్వహించింది కాంగ్రెస్. ఈ కార్యక్రమం గురించి ఆ పార్టీ ఎంపీ సుఖ్‌దేవ్ భగత్ కూడా స్పందించారు. రాహుల్ చేపట్టిన ఈ కార్యక్రమం రాజకీయ వివాదాలకు పరిమితం కాకుండా, వ్యవస్థలో ఉన్న లోతైన సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో సాగుతోందని అన్నారు. ప్రస్తుత వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, దాంట్లో సమూల మార్పు తీసుకురావాలన్నదే రాహుల్ లక్ష్యమని పేర్కొన్నారు.

నలుగురు మాజీ సీఎంలు, 7వేల మంది అరెస్ట్

దేశ రాజధానిలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్?కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసనల్లో పాల్గొనేందుకు వచ్చిన వేలాది మందిని పోలీసులు అడ్డుకున్నారు. నిరసన చేపట్టేందుకు వచ్చిన నలుగురు మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, పినరయి విజయన్, మాణిక్ సర్కార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు పలువురు ఇండీ కూటమి నేతలు, వామపక్ష నాయకులు, సామాజిక కార్యకర్తలను నిర్బంధించారు. మరోవైపు, జంతర్‌మంతర్‌కు వెళ్లేందుకు ప్రయత్నించిన 7వేల మందికిపైగా నిరసనకారులను అదుపులోకి తీసుకున్నట్లు దిల్లీ పోలీసులు వెల్లడించారు. ముందస్తు చర్యల్లో భాగంగా నేర చరిత్ర ఉన్న 600 మందికిపైగా వ్యక్తులను కూడా నిర్బంధించినట్లు తెలిపారు.

దీప్కేను విమానంలోనే!

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను పోలీసులు విమానంలోనే అదుపులోకి తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. నిరసనలో పాల్గొనేందుకు ముంబయి నుంచి దిల్లీకి వచ్చిన ఆయనతో పాటు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాను కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపాయి. అందుకు సంబంధించిన దృశ్యాలను సీజేపీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. తమ నాయకులను నిరసన ప్రదేశానికి వెళ్లకుండా ముందస్తు ప్రణాళికతో అడ్డుకున్నారని పార్టీ ఆరోపించింది. ఇది పౌర హక్కులను ఉల్లంఘించడమేనని విమర్శించింది.

కేజ్రీవాల్, మమతా బెనర్జీ నిర్బంధం

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తన నివాసం నుంచి జంతర్‌మంతర్‌కు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయంలో ఆప్ కార్యకర్తలు పోలీసులను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు కేజ్రీవాల్‌ను ఎత్తుకుని బస్సు వద్దకు తీసుకెళ్లారు. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, దిల్లీ పార్టీ విభాగం అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ సహా పలువురు నేతలను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఓట్ల చోరీ జరుగుతోందని ప్రధాని మోదీపై ఆరోపణలు చేశారు. దేశ యువత మేల్కొందని, అన్యాయానికి భయపడబోరని అన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని సౌత్ అవెన్యూ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జంతర్‌మంతర్‌కు వెళ్లకుండా అడ్డుకోవడంతో ఆమె పార్టీ నేతలతో కలిసి అక్కడే బైఠాయించారు. ఈ నిరసనలో డెరెక్ ఓబ్రియన్, దోలా సేన్



సహా పలువురు తృణమూల్ నేతలు పాల్గొన్నారు. మమతా బెనర్జీ నోటికి బ్యాండేజ్ వేసుకుని నిరసన తెలిపారు. దేశంలో పరిస్థితి ఎమర్జెన్సీని మించిపోయిందని, ఇది సూపర్ ఎమర్జెన్సీలా ఉందని ఆమె విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని కాపాడాలన్నదే తమ సందేశమని పేర్కొన్నారు.

వామపక్ష నేతలూ అదుపులోకి

కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ, వామపక్ష నేత బృందా కారత్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేరళ భవన్ బయట నుంచి జంతర్‌మంతర్‌కు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో వారిని అడ్డుకున్నారు. పోలీసుల చర్యకు వ్యతిరేకంగా నేతలు నినాదాలు చేశారు. విజయన్ ఈ ఘటనపై సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించారు. ప్రతిపక్ష నేతలను చూసి భయపడుతున్నందుకే పోలీసులు ప్రజాప్రతినిధులను అదుపులోకి తీసుకుని, గంటపాటు వాహనాల్లో తిప్పారని విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కులపై ఇలాంటి చర్యలతో తమను భయపెట్టలేరని పేర్కొన్నారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దిల్లీని పోలీసు శిబిరంగా మార్చినప్పటికీ నిరసనల్లో పాల్గొనేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చారని దీపాంకర్ భట్టాచార్య అన్నారు. ఒక ప్రాంతంలో నిరసనను అడ్డుకున్నా, ఉద్యమ స్ఫూర్తిని ఆపలేరని వ్యాఖ్యానించారు.

ప్రజలను భయపెట్టి అడ్డుకోలేరు: ఖర్గే

మరోవైపు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోదీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య జననిగా ఉన్న వ్యవస్థను నోరు మూసిన ప్రజాస్వామ్యంగా కేంద్ర సర్కార్ మార్చివేసిందని ఆరోపించారు. బీజేపీ– ఆర్ఎస్ఎస్ పిరికితనం నేడు బయటపడిందని ఆరోపించారు. "మన యువత, విద్యార్థులు, న్యాయవాదులు, పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు, రైతు సంఘాల నాయకులు, యూట్యూబర్లు, కంటెంట్ సృష్టికర్తలు ఇలా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతి ఒక్కరినీ నిర్బంధిస్తున్నారు" అంటూ పోస్ట్ చేశారు. నిర్బంధాలు, అరెస్టులు, జైళ్లు, లాఠీలు, పెల్లెట్లతో భారత ప్రజలను భయపెట్టి అడ్డుకోలేరని స్పష్టం చేశారు. నిరంకుశ పాలనపై కాంగ్రెస్ పార్టీ, ఇండీ కూటమితో కలిసి సర్వశక్తులు ఒడ్డి పోరాడుతుందని ఖర్గే చెప్పారు. "భారత స్వాతంత్ర్యం కోసం మేం మా రక్తాన్ని చిందించాం. మన ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, ప్రతి భారతీయుడి ప్రాథమిక హక్కులను కాపాడుకోవడానికి మా శక్తివంచన లేకుండా పోరాడుతూనే ఉంటాం" అని ఖర్గే తెలిపారు.

మోదీ, షా నడుపుతున్న నియంతృత్వ దేశం: ప్రియాంక గాంధీ

భారత్? ఇకపై ప్రజాస్వామ్య దేశని కాదని, ప్రధాని మోదీ– అమిత్ షాలు నడుపుతున్న నియంతృత్వమని ఆరోపించారు కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా. "మొదట వారు 254 మంది ఎంపీలను తీవ్రంగా కొట్టి, వారి ప్రాథమిక రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తూ పూర్తిగా చట్టవిరుద్ధంగా నిర్బంధిస్తారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఇతర నిరసనకారుల పట్ల కూడా వారు అదే విధంగా ప్రవర్తిస్తారు. ఆ తర్వాత వారు జాతీయ రాజధానిని ముట్టడిస్తారు, దానికి బారికేడ్లు పెట్టి అన్ని వైపులా మూసివేస్తారు, రైళ్లు, మెట్రోలను నిలిపివేస్తారు, ఇంటర్నెట్‌ను నిలిపివేస్తారు. అన్నిచోట్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తారు. నిరసన తెలిపే తమ రాజ్యాంగ హక్కును వినియోగించుకుంటున్న యువతీ యువకులను కొట్టి నిర్బంధిస్తారు. ఎన్నికల సంఘం కుమ్మక్కుతో వారు ఎన్నికలలో మోసం చేశారనడానికి, తమ ప్రభుత్వ చట్టబద్ధత బట్టబయలవుతోందని ఇది రుజువు కాకపోతే మరేమిటి? ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కడానికి వారితో కుమ్మక్కవుతున్న వారందరూ దేశద్రోహానికి పాల్పడుతున్నారు" అంటూ ఆరోపణలు చేశారు.

సుప్రీంకోర్టులో విచారణ

దిల్లీలో సీజేపీ నిరసనల వేళ మెట్రో, రైలు సేవలు పూర్తిగా నిలిపివేయకూడదంటూ ఇచ్చిన ఆదేశాన్ని అధికారులు ఉల్లంఘించారని ఆరోపిస్తూ, వారిపై చర్యలు ప్రారంభించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ పిటిషన్?పై జస్టిస్ జయమాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఆదివారం విచారణ చేపట్టనుంది.

పాకిస్థాన్‌లో మరో దారుణం..



పాకిస్థాన్‌లో మతపరమైన మైనారిటీలపై దాడులు కొనసాగుతున్నాయి. పంజాబ్ ప్రావిన్స్‌లో దైవదూషణ ఆరోపణలతో ఓ క్రైస్తవుడి ఇల్లు, దుకాణానికి ముస్లిం మూక నిప్పుపెట్టింది. ఈ ఘటనతో భయాందోళనకు గురైన 35కు పైగా క్రైస్తవ కుటుంబాలు ప్రాణభయంతో తమ ఇళ్లను విడిచి సురక్షిత ప్రాంతాలకు పారిపోయాయి. క్రిస్టియన్ డైలీ ఇంటర్నేషనల్-మార్నింగ్ స్టార్ న్యూస్ కథనం ప్రకారం పంజాబ్ ప్రావిన్స్‌లోని షేఖుపురా జిల్లా, ఘరియల్ కలాన్ గ్రామంలో ఈ దారుణం జరిగింది. గ్రామంలో ఫార్మసీ నడుపుతున్న కమ్రాన్ మసీహ్ (40) అనే వ్యక్తి వాట్సాప్ గ్రూపుల్లో దైవదూషణకు సంబంధించిన వీడియోను షేర్ చేశాడని స్థానిక ముస్లింలు ఆరోపించారు. ఈ ఆరోపణలతో గురువారం రాత్రి పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. ఈ విషయం తెలియగానే శుక్రవారం రోజున వందలాది మంది ముస్లింలు కమ్రాన్ దుకాణం, ఇంటి వద్ద గుమిగూడారు. కొద్దిసేపటికే ఆగ్రహంతో ఊగిపోయిన కొందరు వ్యక్తులు ఆ రెండు భవనాలకు నిప్పుపెట్టారు. కమ్రాన్ అరెస్టు, ఆస్తుల ధ్వంసం వార్త తెలియగానే, గ్రామంలోని ఇతర క్రైస్తవ కుటుంబాలు మూకదాడులు జరగవచ్చనే భయంతో ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోయినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కమ్రాన్‌పై దైవదూషణ చట్టంలోని ఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారనే దానిపై స్పష్టత లేదని ఆయన బంధువులు పేర్కొన్నారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. క్రైస్తవుల ఆస్తులు, నివాసాలకు రక్షణ కల్పించేందుకు భారీ సంఖ్యలో పోలీసులను మోహరించినట్లు షేఖుపురా జిల్లా పోలీస్ కార్యాలయం తెలిపింది. ప్రస్తుతం పరిస్థితి సున్నితంగా ఉన్నందున, దర్యాప్తు వివరాలు వెల్లడించలేమని ఓ అధికారి తెలిపారు.

దుర్వినియోగమవుతున్న దైవదూషణ చట్టాలు

పాకిస్థాన్‌లో దైవదూషణ చట్టాలు తరచూ దుర్వినియోగం అవుతున్నాయని, వ్యక్తిగత కక్షలు, తగాదాల కోసం వీటిని వాడుకుంటున్నారని మానవ హక్కుల సంఘాలు ఎప్పటినుంచో ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా మతపరమైన మైనారిటీలే లక్ష్యంగా ఈ చట్టాలను ప్రయోగిస్తున్నారని ఆరోపిస్తున్నాయి. గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా నమోదైన 333 దైవదూషణ కేసుల్లో చాలా వరకు తప్పుడువని ఇటీవల ఓ పార్లమెంటరీ కమిటీకి అధికారులు నివేదించారు. అత్యధికంగా పంజాబ్ ప్రావిన్స్‌లోనే 116 కేసులు నమోదైనట్లు అధికారిక డేటా వెల్లడించింది. చాలా కేసుల్లో ఆరోపణలకు సరైన ఆధారాలు లేకపోవడంతో కొట్టివేసినట్లు అధికారులు కమిటీకి తెలిపారు. దైవదూషణ చట్టాల దుర్వినియోగాన్ని అరికట్టడంలో, మైనారిటీలను రక్షించడంలో పాక్ ప్రభుత్వం విఫలమవుతోందని 'వాయిస్ ఆఫ్ పాకిస్థాన్ మైనారిటీ' వంటి సంస్థలు ఆరోపిస్తున్నాయి.

'గెలిస్తే నిజాయతీ- ఓడితే అవకతవకలా'



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ దిల్లీలో ప్రతిపక్షాలు, పౌర సమాజ సంఘాలు ఆందోళనలు నిర్వహిస్తున్న వేళ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఒకవైపు దీనికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తుంటే, ఎన్నికల సంఘం అలాగే సర్ ప్రక్రియకు మద్దతు ప్రకటించారు మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు. భారత ఎన్నికల సంఘం నిష్పాక్షికతను, అలానే భారత ఎన్నికల విధానాన్ని సమర్థిస్తూ దేశానికి చెందిన 124 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల బృందం ఒక బహిరంగ లేఖను విడుదల చేసింది. ఎలాంటి సరైన ఆధారాలు లేకుండా ఓట్ల చోరీ జరిగిందని, ఎన్నికల రిగ్గింగ్ అని ఆరోపణలు చేయడం సరికాదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తగిన సాక్ష్యాధారాలు లేకుండా ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించడం వల్ల ప్రజాస్వామ్య సంస్థలపై దేశ ప్రజలకు ఉన్న విశ్వాసం దెబ్బతింటుందని అన్నారు. ఆరోపణలకు విశ్వసనీయమైన ఆధారాలు ఉండాలని, అంతేకానీ నిరాధారంగా ఎన్నికలు రిగ్గింగ్‌కు గురయ్యారని ప్రచారం చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు.

నమ్మకాన్ని దెబ్బతీస్తున్నట్లే!

దిల్లీలో శనివారం సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ, ఆయనకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో పాల్గొనేందుకు ప్రయత్నించిన పలువురు ప్రతిపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో నలుగురు మాజీ ముఖ్యమంత్రులు కూడా ఉన్నారు. ఈ క్రమంలోనే సివిల్ సర్వెంట్ల బృందం లేఖ విడుదల చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాము ఏ రాజకీయ పార్టీకి చెందినవారము కాదని మాజీ అధికారులు లేఖలో స్పష్టం చేశారు. తమ ఉద్యోగ జీవితంలో ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా తయారీ, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల పర్యవేక్షణ వంటి బాధ్యతలను ఎన్నో సార్లు నిర్వహించామని గుర్తుచేశారు. 'అసలు ఎలాంటి ఆధారాలు లేకుండా మన ఎన్నికలను రిగ్గింగ్ అంటూ ఒక పదాన్ని పదేపదే ఉపయోగిస్తున్నారు. ప్రతిసారీ అలా అనడం ప్రజాస్వామ్యంపై మనందరికీ ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తుంది' అని లేఖలో పేర్కొన్నారు.

గెలిస్తే నిజాయతీ- ఓడితే అవకతవకలా?

ఎన్నికల్లో గెలిచినప్పుడు అదే వ్యవస్థ నిజాయతీగా ఉందని, అదే ఓటమి ఎదురైనప్పుడు అక్రమాలు, అవకతవకలకు పాల్పడిందని చెప్పడం సరికాదని మాజీ అధికారులు ఈ సందర్భంగా లేఖలో ప్రస్తావించారు. 'వ్యవస్థపై మీకు అనుమానమా? లేక ఫలితంపైనా?' అని ప్రశ్నిస్తూ, తగిన ఆధారాలేం లేకుండా తప్పుడు కథనాలను ప్రచారం చేయడం వల్ల ప్రజాస్వామ్యం దెబ్బతింటుందని అన్నారు.

బిహార్ ఎన్నికలే ఉదాహరణ!

ఎన్నికల నిర్వహణలో వచ్చిన మార్పులకు 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికలను ఉదాహరణగా మాజీ అధికారులు పేర్కొన్నారు. బిహార్ చరిత్రలోనే తొలిసారిగా అక్కడ ఒక్క రీపోలింగ్ కూడా అవసరం లేకుండా ఎన్నికలు పూర్తయ్యాయని, 1951 తర్వాత అత్యధిక ఓటింగ్ శాతం నమోదైందని తెలిపారు. మహిళలు కూడా రికార్డు స్థాయిలో ఓటు హక్కు వినియోగించుకున్నట్లు లేఖలో గుర్తుచేశారు. అధికారులు పూర్తిగా మారిపోయినందువల్లే ఇది సాధ్యమైందని కాదని, ఎన్నికల సంఘం రూపొందించిన వ్యవస్థలో పర్యవేక్షణ, జవాబుదారీతనం ఉండటమే ఇందుకు కారణమని వివరించారు. ఇక ఈవీఎంలు, స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రత గురించి ప్రస్తావించిన మాజీ అధికారులు– ప్రతి అభ్యర్థి తరఫున ఏజెంట్లు పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రక్రియను గమనించగలరని, పోలైన ఓట్ల లెక్కకు సంబంధించిన సంతకం చేసిన వివరాల్ని కూడా అందుకుంటారని తెలిపారు. అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలోనే ఈవీఎంలను సీల్ చేస్తారని, ఆ సీల్స్‌పైనా వారి సంతకాలు ఉంటాయని వివరించారు. తర్వాత యంత్రాలను స్ట్రాంగ్‌రూంలో భద్రపరుస్తారని, అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు వాటి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. .

ముగ్గురు ఉండడం కరెక్టే

ఎన్నికల సంఘంలో ముగ్గురు కమిషనర్లు ఉండటాన్ని కూడా మాజీ అధికారులు సమర్థించారు. 1995లో సుప్రీం కోర్టు దీనిని సమర్థించిందని, ఒకే వ్యక్తి చేతిలో అధికారం కేంద్రీకృతం కాకుండా ఉండటానికే ఈ విధానం ఉందని తెలిపారు. ముగ్గురు ఎన్నికల కమిషనర్లు ఉండటం వల్ల కీలక నిర్ణయాలపై సమష్టిగా చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని, ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోలేరని అభిప్రాయపడ్డారు.

విమానంలో పైలట్ స్మిత్‌పై దాడి కేసు నమోదు చేసిన ఎన్ఐఏ



దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై కో పైలట్ కత్తితో దాడి చేసిన ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కేసు నమోదు చేసింది. ఇప్పటికే ఆ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసిన అధికారులు, దాడికి దారితీసిన పరిస్థితులు, విమానాన్ని హైజాక్ చేయడానికి ప్రయత్నం జరిగిందా అనే అంశాలపై దర్యాప్తు చేయనున్నారు. అయితే స్మిత్ మచ్చర్‌పై దాడి చేసిన ఘటనను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. భారతీయ పైలట్‌పై దాడి జరగడం, విమానాన్ని హైజాక్ చేయడానికి లేదా కూల్చివేయడానికి ప్రయత్నం జరిగి ఉండొచ్చనే అనుమానాల నేపథ్యంలో సమగ్ర దర్యాప్తు అవసరమని భావించింది. దీంతో జాతీయ దర్యాప్తు సంస్థకు కేసును అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఎన్ఐఏ అక్టోబర్ 9న కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. యాంటీ హైజాకింగ్ చట్టం– 2016లోని సంబంధిత నిబంధనలతో పాటు, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ)–1967 కింద కేసు నమోదు చేశారు. యూఏపీఏలోని సెక్షన్ 16తో పాటు సెక్షన్ 15(1)(ఎ) నిబంధనలను కూడా ఆ కేసుకు వర్తింపజేసినట్లు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల్లో పేర్కొన్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ చట్టం–2008 ప్రకారం, ఈ కేసులో పేర్కొన్న నేరాలు ఎన్ఐఏ విచారణ చేపట్టేందుకు వీలున్న నేరాల జాబితాలోకి వస్తాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం చట్టంలోని సెక్షన్ 6లోని ఉప సెక్షన్లు 5, 8తో పాటు సెక్షన్ 8 కింద తన అధికారాలను ఉపయోగించి దర్యాప్తునకు ఆదేశించింది. ఘటన వెనుక ఏదైనా పెద్ద కుట్ర ఉందా అనే అంశాన్ని కూడా ఎన్ఐఏ పరిశీలించనుంది. కాక్‌పిట్‌లో అసలు ఏం జరిగింది, దాడికి దారితీసిన పరిస్థితులు ఏమిటి, విమానాన్ని హైజాక్ చేయాలనే ఉద్దేశం ఉందా, విమానాన్ని కూల్చివేయడానికి ప్రయత్నించారా అనే కోణాల్లో దర్యాప్తు సాగనుంది. ఈ ఘటనకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర పరిణామాలు ఉండే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అయితే కో పైలట్ దాడికి పాల్పడటానికి గల కారణాలు ఏమిటి, ఘటనకు ముందు విమానంలో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయి అనే విషయాలపై ఇప్పటివరకు స్పష్టమైన వివరాలు వెల్లడికాలేదు. దాడి వెనుక ఉద్దేశం ఏమిటనేది కూడా తేలాల్సి ఉంది. ఆ అంశాలన్నింటినీ పరిశీలించి, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వెలుగులోకి తీసుకురావడమే ఎన్ఐఏ దర్యాప్తు లక్ష్యంగా ఉండనుంది.

సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు ఫ్లైదుబాయ్ విమానం ఎఫ్‌జెడ్ 1073 బయలుదేరింది. ఉదయం 7.05 గంటలకు గల్ఫ్ కాలమానం ప్రకారం ప్రయాణం ప్రారంభించింది. ఆ విమానంలో 174 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. విమానానికి భారతీయుడైన కెప్టెన్ స్మిత్ మచ్చర్? నాయకత్వం వహించగా, ఒమన్‌కు చెందిన వ్యక్తి కో పైలట్‌గా ఉన్నారు. విమానం జోర్డాన్–సౌదీ అరేబియా సరిహద్దు ప్రాంతం సమీపంలో ప్రయాణిస్తున్న సమయంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. కాక్‌పిట్‌లో కెప్టెన్ స్మిత్?పై కో పైలట్ కత్తితో దాడి చేశారు. ఆ దాడి విమానాన్ని హైజాక్ చేయడానికి లేదా దాన్ని కూల్చివేయడానికి చేసిన ప్రయత్నం అయి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. కాక్‌పిట్‌లో జరిగిన దాడిని గుర్తించిన ప్రయాణికులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. దాడికి పాల్పడిన కో పైలట్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. చివరకు అతడిని నిలువరించి కట్టడి చేసినట్లు సమాచారం. ఆ దాడిలో కెప్టెన్ స్మిత్ మచ్చర్? తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. విమానంలో ఇతర ఫ్లైదుబాయ్ పైలట్లు కూడా ఉండటంతో వారు విమాన నియంత్రణ బాధ్యతలు చేపట్టారు. పరిస్థితిని అదుపులోకి తీసుకుని విమానాన్ని సురక్షితంగా దించారు. సౌదీ అరేబియాలో

రెండో టెస్టు డ్రా..

గిల్ సేనదే సిరీస్

భారత్ విజయానికి అడ్డుగోడలా దినుష..

ఫాలో ఆన్ ఆడినా అద్భుత పోరాటంతో రెండో టెస్టును డ్రా చేసుకున్న శ్రీలంక

అజేయ సెంచరీతో జట్టును ఆదుకున్న యువ కెరటం సోనల్ దినుష

తొలి ఇన్నింగ్స్‌లో పడిక్కల్, ధ్రువ్ జురెల్ శతకాలతో భారత్ భారీ స్కోరు

బౌలర్లకు సహకరించని పిచ్‌పై లంక బ్యాటర్ల అద్వితీయ నిలకడ

ఈ సిరీస్‌లో మూడు సెంచరీలతో దినుష, 16 వికెట్లతో మానవ్ సుతార్ టాప్ పెర్ఫార్మర్లు

కొలంబో: శ్రీలంక యువ బ్యాటర్ సోనల్ దినుష అద్భుతమైన ప్రతిఘటనతో భారత్ విజయానికి అడ్డుగోడలా నిలిచాడు. ఓటమి అంచున నిలిచిన జట్టును తన వీరోచిత సెంచరీతో ఆదుకుని, రెండో టెస్టును డ్రాగా ముగించడంలో కీలక పాత్ర పోషించాడు. ఫాలో ఆన్‌లో రెండో ఇన్నింగ్స్ ఆడిన శ్రీలంక, ఓటమి భయమనుకున్న దశలో దినుష (133 నాటౌట్) అసాధారణ పోరాటపటిమతో భారత్ కు సవాలుగా నిలిచాడు. అతనికి ఇతర బ్యాటర్లు చక్కటి సహకారం అందించడంతో, కొలంబో వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలుపు ఆశలు గల్లంతయ్యాయి.

మ్యాచ్ చివరి రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 429 పరుగులు చేసింది. అప్పటికే లంక ఆధిక్యం 216 పరుగులకు చేరింది. ఇవాళ ఆటకు చివరి రోజు కాగా, టీమిండియా గెలిచే అవకాశం లేకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. అద్భుతమైన ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను కాపాడుకున్న సోనల్ దినుషను భారత ఆటగాళ్లు, కోచ్ గౌతమ్ గంభీర్ ప్రత్యేకంగా అభినందించారు.

ఫాలో ఆన్‌లో లంక పోరాటం

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్, తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్లకు 503 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. దేవదత్ పడిక్కల్ (117), ధ్రువ్ జురెల్ (115) సెంచరీలతో కదం తొక్కగా, యశస్వి జైస్వాల్ (45), శుభ్‌మన్ గిల్ (50), రిషభ్ పంత్ (63) రాణించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక 290 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్ల ధాటికి లంక బ్యాటర్లు చేతులెత్తేయగా, సోనల్ దినుష (103), పసిందు సూరియబండార (80) మాత్రమే రాణించారు. దీంతో భారత్‌కు 213 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

భారీ ఆధిక్యంతో శ్రీలంకను ఫాలో ఆన్‌కు ఆహ్వానించిన భారత్‌కు ఆతిథ్య జట్టు ఊహించని షాక్ ఇచ్చింది. రెండో ఇన్నింగ్స్‌లో లంక బ్యాటర్లు అద్భుతమైన పోరాటాన్ని ప్రదర్శించారు. పసిందు సూరియబండార (92), కమిందు మెండిస్ (55) రాణించగా, సోనల్ దినుష మరోసారి శతకంతో కదంతొక్కాడు. ఈ సిరీస్‌లో అతనికి ఇది మూడో సెంచరీ కావడం విశేషం. దినుషకు కేశర నువంత (46) తోడవడంతో లంక ఓటమి నుంచి గట్టెక్కింది. లంక టెయిలెండర్లు దాదాపు 90 ఓవర్ల పాటు క్రీజులో నిలబడి భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. బ్యాటింగ్‌కు పూర్తిగా అనుకూలించిన పిచ్‌పై భారత బౌలర్లు ప్రభావం చూపలేకపోయారు.

భారత బౌలర్లలో ఈ సిరీస్ మొత్తం మీద మానవ్ సుతార్ 16 వికెట్లతో అగ్రస్థానంలో నిలవగా, లంక బౌలర్లలో అసిత్ ఫెర్నాండో 10 వికెట్లు పడగొట్టాడు. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను భారత్ 1-0తో కైవసం చేసుకుంది.





టీ20ల్లో పొలార్డ్ తుఫాన్..

అత్యధిక పరుగులతో బట్లర్‌కు షాకిచ్చిన హిట్టర్..!

న్యూఢిల్లీ: ఒకప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌లో.. ఆపై ఫ్రాంచైజీ క్రికెట్‌లో ఉతికేస్తున్న కీరన్ పొలార్డ్ మళ్లీ అగ్రస్థానం దక్కించుకున్నాడు. విధ్వంసక ఆటగాడైన పొలార్డ్ టీ20ల్లో అత్యధిక పరుగుల వీరుడిగా నిలిచాడు. కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో 26 బంతుల్లోనే 65 రన్స్ చేసిన ఈ భారీకాయుడు.. ఇటీవల తనను వెనక్కి నెట్టిన ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జోస్ బట్లర్ నుంచి అగ్రస్థానాన్ని లాగేసుకుడు.

పొట్టి క్రికెట్‌లో ఇంగ్లండ్ విధ్వంసక ఓపెనర్ జోస్ బట్లర్ అత్యధిక పరుగుల రికార్డు బద్దలైంది. ది హండ్రెడ్ లీగ్‌లో మెరుపు అర్ధ శతకంతో.. కీరన్ పొలార్డ్‌ను దాటేసిన అతడు ఇప్పుడు మళ్లీ రెండో స్థానానికి పడిపోయాడు. కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో దంచేసిన పొలార్డ్.. 14,921 పరుగులతో అగ్రస్థానం దక్కించుకున్నాడు. స్వదేశంలో జరుగుతున్న ఈ మెగా టోర్నీలో బుధవారం.. ట్రిన్‌బగో నైట్ రైడర్స్ తరఫున 26 బంతుల్లోనే 65 రన్స్ కొట్టిన పొలార్డ్.. మళ్లీ టాప్‌లోకి వచ్చాడు.

అంతర్జాతీయంగా, ఫ్రాంచైజీ టీ20ల్లో 749 మ్యాచులు.. 666 ఇన్నింగ్స్‌ల్లో అతడీ మైలురాయిని సాధించాడు. ద్వితీయ స్థానంలో నిలిచిన బట్లర్ ఖాతాలో 14,833 రన్స్ ఉన్నాయి. ప్రస్తుతం టీ20ల్లో పొలార్డ్ 14,921 పరుగులతో



టాప్‌లో ఉండగా బట్లర్ 14,833 రన్స్‌తో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. మాజీ ఓపెనర్ క్రిస్ గేల్ 14,562 పరుగులు, అలెక్స్ హేల్స్ 14,449, డేవిడ్ వార్నర్ 14,284 రన్స్ సాధించారు.

రెండు ఇన్నింగ్స్‌ల్లో

దినుష శతకగర్జన..

ఎనిమిదో శ్రీలంక క్రికెటర్‌గా రికార్డు..!

కొలంబో: శ్రీలంక క్రికెటర్ సొనాల్ దినుష రికార్డుల మోత మోగిస్తున్నాడు. కొలంబో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో శతకం(103)తో లంకను ఆదుకున్న ఈ కుర్రాడు.. రెండో ఇన్నింగ్స్‌లోనూ సెంచరీతో గర్జించాడు. ఐదో రోజు టీ బ్రేక్ తర్వాత సింగిల్‌తో ఈ సిరీస్‌లో మూడోసారి మూడంకెల స్కోరందుకున్నాడీ లెఫ్ట్ హ్యాండర్. మొత్తంగా.. ఒక టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లో శతకాలు బాదిన ఎనమిదో లంక ప్లేయర్‌గా రికార్డు పుస్తకాల్లోకి ఎక్కాడు దినుష.

కొలంబో టెస్టులో భారత్ బౌలర్లకు ముచ్చెమటలు పట్టిస్తున్న సొమాల్ దినుష రెండో సెంచరీ సాధించాడు. ఐదో రోజు రెండు సెషన్లల్లో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పి లంకను ఆదుకున్న అతడు.. టీ బ్రేక్ తర్వాత చిరస్మరణీయ వంద కొట్టాడు. తద్వారా భారత్‌పై ఒక టెస్టు మ్యాచ్.. రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీ బాదిన మూడో ఆటగాడిగా, ఇతరజట్లతో కలిపితే ఈ ఫీట్ సాధించిన ఎనిమిదో లంకేయుడిగా దినుష రికార్డు సృష్టించాడు. టీమిండియాపై అతడి కంటే



ముందు.. దులీప్ మెండిస్ (1982లో చెన్నై 1015, 105), అరవింద డిసిల్వా(1998 కొలంబో 146, 120)లు మాత్రమే రెండు ఇన్నింగ్స్‌ల్లో శతకంతో మెరిశారు.

అన్ని జట్లపై తీసుకుంటే.. దులీప్ మెండిస్(భారత్‌పై 1982లో), అరవింద డిసిల్వా (1997లో పాకిస్థాన్‌పై), తిలకరత్నే దిల్షాన్ (2009లో బంగ్లాదేశ్‌పై), కుమార సంగక్కర (2013లో బంగ్లాదేశ్‌పై), ధనంజయ డిసిల్వా (2024లో బంగ్లాదేశ్‌పై), కమిందు మెండిస్ (2024లో బంగ్లాదేశ్‌పై).. రెండు ఇన్నింగ్స్‌ల్లో శతకాలు సాధించారు.



బిజినెస్ Business

మార్కెట్లకు మళ్లీ షాక్..

539 పాయింట్లు కుప్పకూలిన సెన్సెక్స్

539 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

116 పాయింట్లు కుంగిన నిఫ్టీ

1.33 శాతం నష్టపోయిన సిమెంట్ రంగ సూచీ

95.50 సమీపంలో ట్రేడైన రూపాయి

ముంబై: అంతర్జాతీయ పరిణామాల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిశాయి. హర్మూజ్ జలసంధిపై జరుగుతున్న చర్చల్లో పురోగతి లేకపోవడం ఇన్వెస్టర్లలో ఆందోళన పెంచింది. దీంతో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. సెన్సెక్స్ 539 పాయింట్లు నష్టపోయి 76,933 వద్ద ముగిసింది. నిఫ్టీ 116 పాయింట్లు తగ్గి 24,090 వద్ద స్థిరపడింది. బ్యాంక్ నిఫ్టీ 273 పాయింట్లు పడిపోయి 57,509 వద్ద ముగిసింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.10 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.13 శాతం నష్టపోయాయి. ఎన్ఎస్ఈలో దాదాపు అన్ని రంగాల సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. ప్రైవేట్ బ్యాంకులు, ఫార్మా, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ మాత్రం స్వల్ప లాభాలు నమోదు చేశాయి. సిమెంట్ రంగ సూచీ 1.33 శాతం, పీఎస్‌యూ బ్యాంక్ 0.94 శాతం, మీడియా 0.89 శాతం, మెటల్స్ 0.86 శాతం చొప్పున నష్టపోయాయి. మార్కెట్‌లో స్వల్పకాలంలో ఒడుదొడుకులు కొనసాగే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా కోలుకుంది. గత సెషన్‌లో 95.40



స్థాయికి పడిపోయిన రూపాయి.. గురువారం 95.50 సమీపంలో ట్రేడైంది.

విదేశీ సంస్థాగత పెట్టుబడుల ప్రవాహం, కంపెనీల మెరుగైన ఆర్థిక ఫలితాలు దేశీయ మార్కెట్లకు కొంత మద్దతుగా ఉన్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా దేశీయ డిమాండ్ బలంగా ఉండటంతో కొన్ని మిడ్‌క్యాప్ విభాగాలు అంతర్జాతీయ పరిణామాల ప్రభావం నుంచి కొంత రక్షణ పొందుతున్నాయని పేర్కొన్నాయి.

అమెరికా ఫెడరల్ రిజర్వ్ చైర్ జాక్సన్ హోల్ ప్రసంగంపై ఇన్వెస్టర్లు దృష్టి పెట్టారు. ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు, భవిష్యత్ విధానంపై ఆయన చేసే వ్యాఖ్యలు ప్రపంచ మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

భారీ లేఆఫ్‌లకు ప్లాన్..

ఏఐ ఏజెంట్ల దెబ్బకు బెడిసికొట్టిన మెటా వ్యూహం..!



న్యూఢిల్లీ: ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం మెటాలో ఏఐకే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలనుకున్నారట.. అందుకోసం ప్రాజెక్ట్ ఓటీ పేరిట ఒక ప్లాన్‌ను సిద్ధం చేశారట. ఉద్యోగులను రెండు దశల్లో 60 శాతానికి కుదించి.. ఏఐ ఏజెంట్లతోనే ఎక్కువ పనిచేయించుకోవాలన్నది మెటా ప్రధాన లక్ష్యం. మిగిలిన ఉద్యోగుల్ని, ఏఐ ఏజెంట్లను చిన్న బృందాలుగా చేసి, కలిసి పనిచేయించాలని సీఈఓ జుకర్‌బర్గ్ భావించినట్లు తెలుస్తోంది. అయితే ఏఐ ఏజెంట్ల వల్ల ఆ ప్రణాళిక ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదని అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది.

మెటా అంతర్గత ప్రణాళికలో భాగంగా సిబ్బందిని రెండు విడతల్లో 60 శాతానికి కుదించడం మొదటి లక్ష్యం. మేలో తొలి విడతలో లేఆఫ్‌లు జరిగాయి కూడా. నవంబరులో మరికొంత మందిని తొలగించాలనుకున్నా.. ప్రస్తుతానికి ఆ ఆలోచనను పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. ఉద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడం ఒక కారణమైతే.. ఏఐ ఏజెంట్లు మెటా ఆశించిన స్థాయిలో ఉత్పాదకత ఇవ్వడం లేదని అంతర్గత విచారణలో వెల్లడికావడం మరోకారణం.

ఏఐ సాంకేతికతేమీ మెటాకు కొత్తగా వచ్చింది కాదు. ఏఐ మోడల్స్, డేటా సెంటర్లు, కంప్యూటింగ్ ఫెసిలిటీస్‌పై ఈ సంస్థ భారీ ఖర్చు చేస్తోంది. కానీ, మెరుగైన ఉత్పాదకతను ఇచ్చే స్వయం ప్రతిపత్తిగల ఏఐ ఏజెంట్లను తయారు చేయడంలో మాత్రం తడబడిందని ఈ వ్యవహారాన్ని బట్టి తెలుస్తోంది. ఇక కంపెనీలో ఎక్కువభాగం పని ఏఐ చేతిలో పెట్టడమనే ప్లాన్ ఇప్పటికిప్పుడే భారీగా అమలు చేయడం వల్ల ప్రయోజనం లేదని భావించింది. దీనర్థం మెటా ఏఐను పూర్తిగా పదిలేస్తుందని కాదు. ఇప్పటికీ ఏఐ పెట్టుబడులను భారీగా కొనసాగిస్తోంది. రానున్న మూడునుంచి ఆరు నెలల్లో ఈ ఏజెంట్లు మరింత ఉపయోగకరంగా మారతాయని జుకర్‌బర్గ్ ఆశిస్తున్నారు..! దీనిని బట్టి మెటాలో ఉద్యోగులకు లేఆఫ్‌ల బెడద పూర్తిగా తొలగిపోలేదని అర్థమవుతోంది.

రైడింగ్ స్టైల్ మార్చుకోవచ్చు..

యమహా కొత్త బైక్‌లో ఈ ఫీచర్ అదుర్స్!

యమహా వైజెడ్ఎఫ్-ఆర్2 భారత్‌లో విడుదల

ప్రారంభ ధర రూ.2.30 లక్షలు

టాప్ ఆర్2ఎం ధర రూ.2.53 లక్షలు

సెప్టెంబర్ నుంచి డెలివరీలు ప్రారంభం

204 సీసీ ఇంజిన్ 26.1 బీహెచ్‌పీ శక్తినిస్తుంది

న్యూఢిల్లీ: యమహా మోటార్ ఇండియా కొత్త స్పోర్ట్స్ బైక్ వైజెడ్ఎఫ్-ఆర్2ను భారత మార్కెట్లో విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ.2.30 లక్షలు (ఎక్స్-షోరూమ్). టాప్ వేరియంట్ ఆర్2ఎం ధర రూ.2.53 లక్షలు. సెప్టెంబర్ 2026 నుంచి డెలివరీలు ప్రారంభం కానున్నాయి. ఆర్15 తర్వాత ఆర్-సిరీస్‌లో మరో బైక్‌గా వైజెడ్ఎఫ్-ఆర్2 చేరింది.



వైజెడ్ఎఫ్-ఆర్2లో కొత్తగా రూపొందించిన ఛాసిస్ ఇచ్చారు. ఆర్15తో పోలిస్తే దీని బరువు రెండు కిలోలకు పైగా తగ్గింది. అయినా ఛాసిస్ దృఢత్వాన్ని కొనసాగించారు. బైక్ మొత్తం బరువు 149 కిలోలు. దీంతో ఈ విభాగంలో తేలికైన బైక్‌గా నిలిచింది.

ఈ బైక్‌లో కొత్త 204 సీసీ, లిక్విడ్-కూల్డ్ సింగిల్ సిలిండర్ ఇంజిన్ ఉంది. ఇది 26.1 బీహెచ్‌పీ శక్తిని, 19.1 ఎన్ఎం గరిష్ఠ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఆరు గేర్ల గేర్‌బాక్స్ ఇచ్చారు. స్లిప్ అండ్ అసిస్ట్ క్లచ్ ప్రామాణికంగా వస్తుంది. మిడ్, ఎమ్ వేరియంట్లలో క్విక్‌షిఫ్టర్ కూడా ఉంటుంది.

బైక్ ముందు భాగంలో 282 మిల్లీమీటర్ల డిస్క్ బ్రేక్ ఉంది. వెనుక వైపున కూడా డిస్క్ బ్రేక్ ఇచ్చారు. ముందు ఇన్వర్టెడ్ ఫోర్కులు, వెనుక మోనోషాక్ సస్పెన్షన్ ఉన్నాయి. 17 అంగుళాల వీల్స్ ఉన్నాయి. సీటు ఎత్తు 810 మిల్లీమీటర్లు.

ఆర్-సిరీస్ తరహాలోనే వైజెడ్ఎఫ్-ఆర్2 డిజైన్ చేశారు. ఫుల్ ఫెయిరింగ్, ఎల్ఈడీ లైట్లు, డీఆర్ఎల్స్, షార్ప్ టెయిల్ దీని స్పోర్టీ లుక్‌ను పెంచుతున్నాయి. మెటాలిక్ బ్లాక్, డార్క్ బ్లూయిష్ గ్రే, మ్యాట్ వైట్ పెర్ల్, రేసింగ్ బ్లూ, మెటాలిక్ గ్రే రంగుల్లో లభిస్తుంది.

రైడర్లు ట్రీట్, రెయిన్, స్పోర్ట్, కస్టమ్ అనే నాలుగు రైడింగ్ మోడ్‌లను ఎంచుకోవచ్చు. ఆర్2ఎంలో టీఎఫ్‌టీ స్క్రీన్, స్మార్ట్ కీ, అడ్జస్టబుల్ లివర్ల వంటి అదనపు ఫీచర్లు ఉన్నాయి.

గ్యాంగ్‌స్టర్ మోడ్‌లోకి నాని..

సుజీత్ దర్శకత్వంలో 'బ్లడీ రోమియో' షూటింగ్ షురూ!



నేచురల్ స్టార్ నాని వరుస హిట్‌లతో దూసుకుపోతూనే మరోవైపు తన ప్రయోగాత్మక చిత్రాలతో టాలీవుడ్‌లో కొత్త ట్రెండ్ సృష్టిస్తున్నారు. ఇటీవలే ఆయన నటించిన 'ది ప్యారడైజ్' సినిమా నాని కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించి సరికొత్త రికార్డులను సృష్టించింది. ఈ భారీ విజయం అందించిన జోరును ఏమాత్రం తగ్గించకుండా, నాని తన తదుపరి ప్రాజెక్ట్ కోసం వేగంగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ దర్శకుడు సుజీత్ దర్శకత్వంలో నాని ఒక క్రేజీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు సిద్ధమయ్యారు. "బ్లడీ రోమియో" అనే ఆసక్తికరమైన టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే సినీ వర్గాల్లో మరియు ప్రేక్షకులలో భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఈ చిత్రంలో నాని ఇప్పటివరకు చూడని సరికొత్త మాస్ మరియు గ్యాంగ్‌స్టర్ లుక్‌లో కనిపించబోతున్నట్లు సమాచారం. కేవలం యాక్షన్ హీరోగానే కాకుండా, ఒక వైవిధ్యమైన చెఫ్ పాత్రలోనూ, అలాగే మరోవైపు పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్‌గానూ ఆయన ద్విపాత్రాభినయం లేదా విభిన్న షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌లో అదరగొట్టనున్నారని ఫిల్మ్‌నగర్ వర్గాల టాక్. ఈ సినిమా కోసం మేకర్స్ ఇప్పటికే అన్ని పర్మిట్లు పూర్తి చేయగా, అక్టోబర్ 16 లేదా 17 నుంచి ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ సెట్స్‌లోకి అడుగుపెట్టనుంది. తొలి షెడ్యూల్‌లోనే కొన్ని కీలకమైన యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కించేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.

ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిహారిక ఎంటర్‌టైనర్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సుజీత్ టేకింగ్, నాని బాడీ లాంగ్వేజ్ ఈ సినిమాను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్తాయని అభిమానులు గట్టిగా నమ్ముతున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా పూర్తి చేసి, వచ్చే ఏడాదిలోనే (2027) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మొత్తానికి 'ది ప్యారడైజ్' సక్సెస్ ఇచ్చిన జోరుతో నాని ఇప్పుడు పూర్తిగా గ్యాంగ్‌స్టర్ మోడ్‌లోకి మారిపోయి బాక్సాఫీస్ వద్ద మరో సంచలనానికి తెరతీస్తున్నారు.

ట్రోలర్స్‌పై తాప్సీ ఫైర్!

జనాలు చేసే రెండు సెకన్ల కామెంట్లు మా ప్రాణాలు తీస్తున్నాయి..



సినిమా ఇండస్ట్రీ బయటికి ఎంత గ్లామరస్‌గా కనిపిస్తుందో, దాని వెనుక సెలబ్రిటీలు పడే మానసిక వేదన అంతకంటే ఎక్కువగా ఉంటుందని అంటోంది టాలెంటెడ్ హీరోయిన్ తాప్సీ పన్ను. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ భామ సోషల్ మీడియా ట్రోలింగ్, నటులు ఎదుర్కొనే మానసిక ఒత్తిళ్లపై కీలక విషయాలు వెల్లడించారు. సినిమా రంగంలో ఉంటూ నిత్యం విమర్శలను, ట్రోలింగ్‌ను ఎదుర్కోవడం అస్సలు సులువు కాదని తాప్సీ ఆవేదన వ్యక్తం చేశారు. నటుల స్థానం ఎదుటివారి అభిప్రాయాలపైనే ఆధారపడి ఉంటుందని, జనాలు సరదాగా చేసే రెండు సెకన్ల కామెంట్లు కూడా నటుల మానసిక ఆరోగ్యాన్ని దారుణంగా దెబ్బతీస్తాయని.. ఒక్కోసారి ప్రాణాల మీదకి కూడా వస్తుందని చెప్పారు. సోషల్ మీడియాలో అందరినీ సంతోషపెట్టాలనే అసాధ్యమైన ప్రయత్నం చేసి తాను చాలా ప్రశాంతతను కోల్పోయానని, ట్రోలర్లను మెప్పించడానికి ఎంతో విలువైన సమయాన్ని వృథా చేసుకున్నానని వాపోయారు.

కరోనా లాక్‌డౌన్ సమయంలో ఎక్కడికీ వెళ్లే అవకాశం లేకపోవడంతో తన మనసుతో తానే గడపాల్సి వచ్చిందని తాప్సీ గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలోనే తనలోని లోపాలను, భయాలను అర్థం చేసుకుని ప్రొఫెషనల్ థెరపీ తీసుకున్నట్లు వెల్లడించారు. సోషల్ మీడియాలో నిత్యం విమర్శలు ఎదుర్కొంటూ మానసికంగా కుమిలిపోవడం కంటే, అక్కడి నుంచి దూరంగా ఉండటమే మేలని భావించి తాను అప్పట్లో సోషల్ మీడియాకు దూరమయ్యానని స్పష్టం చేశారు. తెరపై ఎంత గ్లామరస్‌గా కనిపించినా నటులు కూడా సాధారణ మనుషులేనని, వారి వెనుక కూడా భావోద్వేగాలు ఉంటాయని ప్రతి ఒక్కరూ గుర్తించాలని తాప్సీ కోరారు.

గ్రామీ బరిలో 'ధురంధర్' సౌండ్‌ట్రాక్..

ఏకంగా ఎనిమిది కేటగిరీల్లో ఎంట్రీలు!



రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రం "ధురంధర్: ది రివెంజ్" సినిమా సంగీతం 2027 గ్రామీ అవార్డుల పరిశీలన కోసం ఎనిమిది విభాగాల్లో దరఖాస్తు చేసుకుంది. చిత్ర నిర్మాణ సంస్థ బి62 స్టూడియోస్ ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించింది. దర్శకుడు ఆదిత్య ధర్ మరియు ఆయన సోదరుడు లోకేష్ స్థాపించిన ఈ స్టూడియో, సంగీత దర్శకుడు శాశ్వత్ సచ్‌దేవ్ అందించిన బాణీలకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చేలా ఈ ప్రచారాన్ని చేపట్టింది. ఈ సినిమాకు సంబంధించి సౌండ్‌ట్రాక్ ఆల్బమ్‌తో పాటు విడి పాటలను కలిపి మొత్తం తొమ్మిది ఎంట్రీలను గ్రామీకి పంపినట్లు స్టూడియో తెలిపింది. విజువల్ మీడియా కోసం ఉత్తమ సంకలన సౌండ్‌ట్రాక్ విభాగంలో ఈ ఆల్బమ్ పోటీపడుతుండగా, అరిజిత్ సింగ్ పాడిన "ఫెర్ సే" పాటను 'విజువల్ మీడియా కోసం వ్రాసిన ఉత్తమ పాట' విభాగానికి పంపారు. అలాగే "ఆరి ఆరి" పాటను 'ఉత్తమ ఆసియన్ పాప్ మ్యూజిక్ పెర్ఫార్మెన్స్' కేటగిరీకి, "జాన్ సే గుజార్తే హై", "కన్హయ్య" పాటలను 'ఉత్తమ గ్లోబల్ మ్యూజిక్ పెర్ఫార్మెన్స్' విభాగంలోనూ పరిశీలిస్తున్నారు. "జాయే సజనా" పాటను 'ఉత్తమ పాప్ డ్యూయో పెర్ఫార్మెన్స్' విభాగంలో, "డెస్టినీ -- మన్ అట్కేయా" పాటను 'ఉత్తమ రాప్ పెర్ఫార్మెన్స్' విభాగంలో, "వాలి జావాన్" పాటను 'ఉత్తమ డాన్స్, ఎలక్ట్రానిక్ రికార్డింగ్' విభాగంలో, అలాగే "హమ్ ప్యార్ కర్నే వాలే" పాటను 'ఉత్తమ రీమిక్స్ రికార్డింగ్' విభాగంలో నామినేషన్ల కోసం సమర్పించారు.

ఇర్షాద్ కమిల్ మరియు ఇతర రచయితలు సాహిత్యం అందించిన ఈ చిత్రంలోని పాటలకు శాశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందించారు. ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన 'ధురంధర్' ఫ్రాంచైజీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సాధించింది. డిసెంబర్ 2025లో వచ్చిన మొదటి భాగం రూ. 1,300 కోట్లకు పైగా వసూలు చేయగా, మార్చి 2026లో విడుదలైన సీక్వెల్ "ధురంధర్: ది రివెంజ్" ప్రపంచవ్యాప్తంగా రూ. 1,800 కోట్లకు పైగా వసూళ్లతో రికార్డు సృష్టించింది. అయితే, ఈ గ్రామీ నామినేషన్లు కేవలం పరిశీలన కోసం మాత్రమేనని, ఇవి నామినేషన్లను నేరుగా ఖాయం చేయవని నిర్వాహకులు తెలిపారు. రికార్డింగ్ అకాడమీ అర్హత ప్రమాదాలను పూర్తి చేసుకుని, ఓటింగ్ ప్రక్రియను దాటిన తర్వాతే అసలు నామినేషన్లు ప్రకటిస్తారు.

'కరికాల' అద్భుత ప్రపంచంలోకి కేథరిన్ ఎంట్రీ..

సందీప్ కిషన్ పాన్ ఇండియా మూవీపై పెరిగిన అంచనాలు



యంగ్ అండ్ ఎనర్జిటిక్ హీరో సందీప్ కిషన్ ఇటీవల 'సిగ్మా', 'సూపర్ సుబ్బు' వంటి సినిమాలతో ప్రేక్షకులను అలరించారు. ఇక ఇప్పుడు ఆయన ప్రధాన పాత్రలో 'కరికాల' అనే భారీ ఫాంటసీ అడ్వెంచర్ మూవీ తెరకెక్కుతోంది. 'శంబాల' సినిమాతో హ్యాట్రిక్ హిట్ కొట్టిన దైరెక్టర్ యుగంధర్ ముని ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై సోషియో ఫాంటసీ డ్రామాగా వస్తున్న ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో రెండు భాగాలుగా విడుదల చేయనున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో 'కరికాల: చాప్టర్ 1'ను 2027 జూలై 2న, అలాగే 'కరికాల: చాప్టర్ 2'ను 2027 అక్టోబర్ 28న థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది.

ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ బిగ్ ప్రాజెక్ట్‌లోకి తాజాగా ఓ హాట్ బ్యూటీ ఎంట్రీ ఇచ్చింది. ఈ చిత్రంలో గ్లామరస్ నటి కేథరిన్ నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 'కరికాల అద్భుత ప్రపంచంలోకి కేథరిన్ థ్రెసాకు స్వాగతం.. ఒక కొత్త సౌందర్యం, రహస్యం.. అద్భుతమైన అధ్యాయం" అంటూ మేకర్స్ ఓ క్రేజీ పోస్టర్‌ను షేర్ చేసి సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేశారు. ఇక ఈ సోషియో ఫాంటసీ మూవీలో కేథరిన్ ఒక ప్రత్యేకమైన గ్లామరస్ స్పెషల్ సాంగ్ చేయబోతున్నట్లు టాక్. కేథరిన్ ఎంట్రీతో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

నా కుటుంబ బలహీనతను వాడుకున్నారు

త్రివిక్రమ్‌పై పూనమ్ ఫైర్



నటి పూనమ్ కౌర్, ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న వివాదం మరోసారి భగ్గుమంది. త్రివిక్రమ్‌పై సోషల్ మీడియా వేదికగా పూనమ్ కౌర్ తాజాగా తీవ్రమైన, సంచలన ఆరోపణలు చేశారు. తన కుటుంబ బలహీనతను ఆసరాగా చేసుకుని, వారి నుంచి బలవంతంగా కొన్ని స్టేట్‌మెంట్లు ఇప్పించుకున్నారని ఆమె ఆరోపించారు. ఈసారి నేరుగా త్రివిక్రమ్ పేరును ప్రస్తావిస్తూ పోస్టులు పెట్టడం గమనార్హం. త్రివిక్రమ్ తీరు అత్యంత దారుణమని ఆమె వ్యాఖ్యానించారు. సమస్యలు వచ్చినప్పుడు దూరంగా జరిగి, అవసరం వచ్చినప్పుడు మళ్లీ వాడుకుంటారని విమర్శించారు. ఈ విషయంలో మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) మౌనంగా ఉండటాన్ని ఆమె తీవ్రంగా ప్రశ్నించారు. "'మా' ఎవరి కోసం ఎదురుచూస్తోంది? త్రివిక్రమ్‌ను ఎందుకు ప్రశ్నించడం లేదు? ఇంకా ఎంతమంది అమాయకుల జీవితాలు నాశనం కావాలి?" అని నిలదీశారు.

తాను ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినా 'మా' స్పందించలేదని పూనమ్ కౌర్ ఇదివరకే ఆరోపించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఓ సినిమాకు సంబంధించిన పరిణామాల నేపథ్యంలో ఆమె చేసిన వ్యాఖ్యలు ఫిల్మ్ ఇండస్ట్రీ వర్గాల్లో, సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. అయితే, పూనమ్ తాజా ఆరోపణలకు దారితీసిన కచ్చితమైన కారణం ఏమిటనేది ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. ఈ వివాదంపై త్రివిక్రమ్ శ్రీనివాస్ గానీ, 'మా' అసోసియేషన్ గానీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు.

కైకేయిగా లారా దత్తా, మంథరగా షీబా..

'రామాయణం' నుంచి ఫస్ట్ లుక్స్ విడుదల



భారతీయ చలనచిత్ర పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పౌరాణిక చిత్రం 'రామాయణం' నుంచి మేకర్స్ వరుస అప్‌డేట్లతో అంచనాలను పెంచుతున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి అయోధ్య రాజసౌధంలో అంతర్గత రాజకీయాలకు కేంద్ర బిందువుగా నిలిచే మహారాణి కైకేయి, మంథర పాత్రల అధికారిక క్యారెక్టర్ పోస్టర్లను చిత్రబృందం విడుదల చేసింది. నితీష్ తివారీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ బడ్జెట్ చిత్రంలో కైకేయి పాత్రలో ప్రముఖ నటి లారా దత్తా నటిస్తుండగా, ఆమెకు కుట్రపూరిత ఆలోచనలు నూరిపోసే మంథర పాత్రలో సీనియర్ నటి షీబా చద్దా కనిపించనున్నారు. ఇక విడుదలైన పోస్టర్‌లో లారా దత్తా ఎంతో రాజసం ఉట్టిపడేలా సంప్రదాయ వస్త్రధారణ, ఆభరణాలు, తలపై కిరీటంతో రాచరిక లుక్‌లో కనువిందు చేస్తున్నారు. ఆమె ముఖంలో తీవ్రమైన, ఆందోళనతో కూడిన భావాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇక మంథర పాత్రలో షీబా చద్దా ముదురు రంగు దుస్తులు, తలపై సాంప్రదాయ వెండి ఆభరణం ధరించి కర్ర పట్టుకుని ఎంతో తీవ్రమైన, లెక్కలేసుకునే చూపులతో విలక్షణమైన రూపంలో కనిపిస్తున్నారు. ఒక రాణి.. ఒక తల్లి.. తండ్రి ప్రేమను వంచించి, రాముడి తలరాతను మార్చేసే రెండు కోరికలు. ఒక కుట్రపూరితమైన మనసు.. ఆమె ఊహాగానాలు ఒక తల్లి ప్రేమను రాజ్యానికి చీకటి రోజులుగా మార్చేస్తాయి అంటూ మేకర్స్ సోషల్ మీడియాలో ఈ పోస్టర్లకు పవర్‌ఫుల్ క్యాప్షన్‌ను జోడించారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com